ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3



అనంతపురం

జిల్లా వార్తలు

సోమవారం 4 మార్చి 2024



రా.. కదలిరా..

నేడు కియ సమీపాన చంద్రబాబు సభ


భారీగా హాజరుకానున్న శ్రేణులు, అభిమానులు

అన్ని దారులు పెనుకొండ వైపే..

టీడీపీ ఆధ్వర్యంలో రా.. కదలిరా.. బహిరంగ సభను శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలంలోని కియ కార్ల పరిశ్రమ వద్ద సోమవారం నిర్వహించనున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు హాజరుకానున్నారు. సభను విజయవంతం చేసేందుకు పార్టీ నేతలు చర్యలు చేపడుతున్నారు. పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు భారీఎత్తున తరలి వెళ్లనున్నారు. అన్ని దారులు పెనుకొండ వైపే...

వివరాలు.. 5లో...

యోగా బాధితులకు వార్నింగ్..!



- రాష్ట్రవ్యాప్తంగా యోగా టీచర్లకు బెదిరింపులు
- బుద్ధ యోగా హెల్త్ ఫౌండేషన్ నిర్వాహకుల అరాచకాలు
- ఒక్కొక్కరి నుంచి రూ.3 లక్షలదాకా వసూలు
- కోట్ల రూపాయలు కొల్లగొట్టి.. కట్టుకథలు
- కొడతాం, కేసులు పెడతాం అంటున్న నిర్వాహకులు
- ఏకమవుతున్న బాధితులు
- నేడు విజయవాడకు..

అనంతపురం విద్య

'దిక్కున్నోడికి చెప్పుకోండి, ఒత్తిడి చేస్తే... వేధిస్తున్నారంటూ.. కేసులు పెడతాం' అంటూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బుద్ధ యోగా హెల్త్ ఫౌండేషన్ నిర్వాహకులు, మధ్యవర్తులు... బాధిత యోగా టీచర్లను హెచ్చరిస్తున్నారు. ఈ విషయాలు ఆలస్యంగా వెలుగు చూస్తున్నాయి. ఉద్యోగాలు ఇప్పిస్తాం అంటూ రాష్ట్ర వ్యాప్తంగా రూ.2లక్షలు, రూ.3లక్షలు ఇలా నిరుద్యోగుల నుంచి వసూలు చేశారు. అడ్డగోలుగా డబ్బులు లాగేసి, కోట్ల రూపాయలు కొల్లగొట్టారు. ఆ ఫౌండేషన్ నిర్వాహకులు, వారికి తొత్తులుగా వ్యవహరిస్తున్న ఏజెంట్లు, మధ్యవర్తుల అక్రమాలపై 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలతో బాధిత యోగా టీచర్లు మేల్కొంటున్నారు. ఉద్యోగం ఇప్పిస్తామని నిర్వాహకులు, ఏజెంట్లు వసూలు చేసిన డబ్బు వెనక్కివ్వాలని ఫోన్లు చేసి, డిమాండ్ చేశారు. పని చేసిన కాలానికి చెల్లించాల్సిన జీతాలను గట్టిగా అడుగుతున్నారు. ఫోన్లు చేసి వారు చేసిన మోసాలు, అక్రమాలపై ప్రశ్నిస్తున్నారు. బాధితులంతా ఒక వేదికపైకి వస్తున్నారు. గట్టిగా నిలదీస్తుండటంతో... బాధితులపై బుద్ధ యోగా హెల్త్ ఫౌండేషన్ నిర్వాహకులు బెదిరింపులకు దిగుతున్నారు.

మోసాలు ఒక్కొక్కటిగా బయటకు...

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బుద్ధ యోగా ఫౌండేషన్ బాధితులైన యోగా టీచర్లు భారీగా ఉన్నారు. వారి నుంచి రూ.లక్షలు వసూలు చేసి... జీతాలివ్వకుండా నెలల తరబడి కబుర్లు చెబుతుండటంపై యోగా టీచర్లు అప్రమత్తమయ్యారు. ఫౌండేషన్ నిర్వాహకుల చేతుల్లో మోసపోయామని తెలుసుకుని, వారిని నిలదీస్తున్నారు. వైజాగ్, నంద్యాల, అనకాపల్లి, కడప, అనంతపురం తదితర జిల్లాల్లోని యోగా టీచర్లు అంతా ఆ ఫౌండేషన్ నిర్వాహకులు, ఇతర ఏజెంట్లకు ఫోన్లు చేసి నిలదీస్తుండటంతో... మరో రకంగా బెదిరిస్తున్నారు. వైజాగ్ జిల్లాకు చెందిన ఓ నిరుద్యోగి నుంచి ఉద్యోగంలో చేరే ముందు రూ.2 లక్షలకుపైగానే వసూలు చేశారు. మోసాలు తెలుసుకున్నాక ఆ నిరుద్యోగ యువకుడు ఫౌండేషన్ ఆఫీస్‌లో పనిచేసే మహిళా ఉద్యోగికి అప్పట్లో రూ.లక్ష ఇవ్వడంతో ఆమెను ప్రశ్నించాడు. దీంతో ఆమె... తాను ఉద్యోగం మానేశాననీ, వెళ్లి ఆఫీస్‌లో అడగాలని తెలిపింది. మరీ ఎక్కువ ఫోన్లు చేసి, అడిగితే... వేధిస్తున్నావంటూ తిరిగి కేసు పెడతానంటూ బెదిరించినట్లు తెలుస్తోంది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కర్నూలు జిల్లాలో ఓ నిరుద్యోగి నుంచి ఫౌండేషన్ నిర్వాహకులు ఉద్యోగం ఆశ చూపి రూ.2.50లక్షలు పైగానే వసూలు చేశారు. ఉద్యోగంలో చేరేందుకు వెళ్లగా... ఇలాంటివన్నీ బోగస్ అంటూ ఓ ఎంఈఓ.. ఆ నిరుద్యోగి కళ్లు తెలిపించాడు. దీంతో సదరు నిరుద్యోగి మోసపోయానని గ్రహించి నిర్వాహకులను గట్టిగా నిలదీయడంతో ఆఖరికి సుమారు రూ.1.45 లక్షల వరకూ వెనక్కు ఇచ్చినట్లు సమాచారం. మిగిలిన డబ్బు అదిగో.. ఇదిగో అంటూ కాలం వెళ్లదీస్తున్నారు.

నేడు విజయవాడకు...

పలు జిల్లాల బాధిత యోగా టీచర్లు విజయవాడకు చేరుకుంటున్నారు. గుంటూరులోని బ్రాడీపేటలో ఉన్న యోగా ఫౌండేషన్ కార్యాలయంలో నిర్వాహకులను కలిసి గట్టిగా నిలదీయాలని సిద్ధమయ్యారు. ఇప్పటికే వైజాగ్, నంద్యాల తదితర జిల్లాల నుంచి 30 మంది వరకూ విజయవాడ చేరినట్టు సమాచారం. ఇతర జిల్లాల నుంచి మరో 100 మంది వరకూ సోమవారం విజయవాడకు చేరనున్నట్లు తెలుస్తోంది. ఫౌండేషన్ నిర్వాహకుల మోసం, వసూలు చేసిన డబ్బు, ఇంతకాలం స్కూళ్లలో పనిచేయించుకుని జీతాలు ఇవ్వకపోవడం, తదితరాలపై గట్టిగానే ప్రశ్నించేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే కొందరు బాధితులపై నిర్వాహకులు, మరికొందరు బ్రోకర్లు బెదిరింపులకు దిగుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు.. తమకు అండగా లేరంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కోట్ల రూపాయలు నిరుద్యోగుల నుంచి దోచేసిన అక్రమార్కులపై చర్యలు తీసుకుని, తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

ఎందుకిలా చేశారబ్బా...!

- హడావుడిగా విలేజ్ వెటర్నరీ అసిస్టెంట్లకు నియామక ఉత్తర్వులు
- కలెక్టర్ చేతుల మీదుగా ఇప్పిస్తామని ప్రకటన
- ఒక రోజు ముందే జారీపై విమర్శలు



విలేజ్ వెటర్నరీ అసిస్టెంట్లకు నియామక, స్థానాల కేటాయింపు ఉత్తర్వులు అందజేస్తున్న అధికారులు

అనంతపురం అర్బన్, మార్చి 3: గ్రామ పశుసంవర్ధక సహాయకుల (విలేజ్ వెటర్నరీ అసిస్టెంట్ల) నియామక ఉత్తర్వులు, స్థానాల కేటాయింపు ఉత్తర్వుల జారీ ప్రక్రియను అధికారులు హడావుడిగా నిర్వహించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు అధికార పార్టీ నాయకుల సిఫార్సుల మేరకు కొత్తగా నియమితులైన విలేజ్ వెటర్నరీ అసిస్టెంట్లకు స్థానాలు కేటాయించారన్న ఆరోపణలు తొలి నుంచి వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సిబ్బందికి కౌన్సెలింగ్ నిర్వహించకుండానే కేవలం ఆప్షన్లు తీసుకుని, పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారులు స్థానాలు కేటాయించారన్న ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంపై 'ఆంధ్రజ్యోతి' ఇటీవలే కథనం ప్రచురించింది. ఈ పరిణామాల నేపథ్యంలో మరోసారి పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారులు విలేజ్ వెటర్నరీ అసిస్టెంట్లకు నియామక, స్థానాల కేటాయింపు ఉత్తర్వులు జారీ చేయడంలో రహస్య పద్ధతిని అమలు చేయడం అనుమానాలకు తావిస్తోంది. సోమవారం జిల్లా కలెక్టర్ గౌతమి చేతుల మీదుగా కొత్తగా నియమితులైన 439 మంది సిబ్బందికి ఉత్తర్వులు, అందజేస్తామని ఇదివరకు ఆ శాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఆ మేరకు ప్రకటనలు కూడా ఇచ్చారు. ఉన్నట్లుండి గుట్టు చప్పుడు కాకుండా ఆదివారం పశుసంవర్ధక శాఖ జేడీ కార్యాలయంలో 281 మంది సిబ్బందికి నియామక, స్థానాల కేటాయింపు ఉత్తర్వులు అందజేయడం గమనార్హం. ఈ వ్యవహారంలో పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారుల తీరు విమర్శలకు తావిస్తోంది. కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తర్వులు ఇప్పించకుండా ఎందుకు ఒకరోజు ముందే ఇవ్వాల్సి వచ్చిందన్న దానిపై ఆ శాఖ అధికారులు పొంతనలేని సమాధానాలు చెబుతుండటం విడ్డూరం.

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

తాడిపత్రిటౌన్, మార్చి 3: పట్టణంలోని ప్రముఖ శైవక్షేత్రమైన బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అంకురార్పణ, గణపతిపూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య సంప్రోక్షణ తదితర పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు విశేష అలంకరణ చేసి పూజలు చేశారు. సాయంత్రం ధ్వజారోహణం, రాత్రికి చిత్రగోపురం కార్యక్రమాలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.



అలంకరణలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులు

పొలాల్లో చిరుత హల్‌చల్!



కళ్యాణదుర్గంరూరల్, మార్చి 3: మండలంలోని చాపిరి గ్రామ సమీప పొలాల్లో చిరుత హల్‌చల్ చేసింది. ఆదివారం పొలాల్లోకి వెళుతున్న చిరుతను చూసి ప్రజలు, రైతులు బెంబేలెత్తుతున్నారు. తరచుగా గ్రామంలో చిరుత కనిపిస్తోందని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. వెంటనే అటవీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

ఉన్మాదుల స్వర్గం..!

నేరగాళ్లకు పోలీసుల సహకారం

- ప్రజల విమర్శలను పట్టించుకోని వైనం
- అధికార పార్టీ కనుసన్నల్లో ఖాకీ వ్యవస్థ
- శ్రీకృష్ణపై దాడి జరిగి రెండు వారాలు
- స్వేచ్ఛగా తిరుగుతున్న వైసీపీ గూండాలు
- గతంలో పోలీసులపైనా దాడి ఘటనలు
- వేటినీ సీరియస్‌గా తీసుకోని ఉన్నతాధికారులు





సిద్ధం సభలో శ్రీకృష్ణపై దాడి చేస్తున్న వైసీపీ మూకలు



అశోక్



బండి రవి



రాప్తాడు

వారు ప్రభువుల సేవలో తరలిస్తున్నారు. ప్రజలకు జవాబుదారీ ఉండటం మానేసి.. పాలకుల దుశ్చర్యలకు వంత పాడుతున్నారు. ఉన్నతంగా చదవి.. కష్టపడి ఉద్యోగం సంపాదించి.. 'జీ హుజూర్' అంటూ బానిసత్వం ప్రదర్శిస్తున్నారు. ఫొటో జర్నలిస్టు శ్రీకృష్ణపై దాడి ఘటనలో.. ఉమ్మడి జిల్లాలోని కొందరు పోలీసు అధికారులు వ్యవహరిస్తున్న తీరు విస్మయం కలిగిస్తోంది. 'డోంట్ వర్రీ.. తొందరేం లేదు.. మీరు బెయిల్ తెచ్చుకోండి..' అన్నట్లుగా పోలీసులు వ్యవహరిస్తున్నారు. సాక్ష్యాధారాలు పక్కాగా ఉన్నా.. ప్రజలు గుర్తించిన ఓ నలుగురిపై కేసు నమోదు.. కంటి తుడుపుగా ఒకరి అరెస్టు మినహా.. సొంతంగా ఏ ఒక్క అడుగూ వేసిన దాఖలాలు కనిపించడం లేదు. ఒకవేళ.. 'వీడియోలో ఓ పదిమంది ముఖాలు బాగా కనిపిస్తున్నాయి కదా..? నలుగురిపైనే కేసేమిటి..?' అని కోర్టు ప్రశ్నిస్తే.. ఏం సమాధానం చెబుతారు..? అప్పుడు అధికార పార్టీవారు 'యువరానర్.. మేమే పట్టుకోవద్దని చెప్పాం.. పోలీసుల తప్పేం లేదు..' అని మద్దతుగా నిలబడతారని అమాయకంగా అనుకుంటున్నారా ఏమిటి..? చట్టబద్ధంగా వ్యవహరించలేనంత బేలతనానికి కారణమేమిటో పోలీసు వ్యవస్థ ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన అవసరం ఉంది.

ఎందరు ఉద్యమించినా..

ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి ఘటనను ప్రజాస్వామ్యవాదులు అందరూ ఖండించారు. ఇందులో కొందరు అధికారపార్టీవారూ ఉన్నారు. జర్నలిస్టులు, విపక్షాలు, ప్రజా, విద్యార్థి సంఘాలు ఆందోళనలు నిర్వహించాయి. పోలీసు వ్యవస్థలో జిల్లా సర్వోన్నత అధికారిని కలిసి 'పత్రికా స్వేచ్ఛను కాపాడండి..' అని వందలాది మంది విన్నవించారు. రాప్తాడు సిద్ధం సభలో గత నెల 18న జరిగిన అమానవీయ దాడి గురించి దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి. ఈ కేసులో పోలీసులు ఎలా వ్యవహరిస్తారో అని సామాన్యులు ఆసక్తిగా ఎదురుచూశారు. మరుసటి రోజే ఒకరిని అరెస్టు చేయడం, హత్యాయత్నం కేసు నమోదు చేయడంతో 'పరవాలేదు.. పోలీసులు స్పందిస్తున్నారు..' అని భావించారు. కానీ అది వ్యూహాత్మక ఎత్తుగడ అని, కంటితుడుపు చర్య అని కొన్నాళ్లకే తేలిపోయింది. దాడి దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. గంటల వ్యవధిలో దాడిచేసినవారిని జనం గుర్తించారు. వారి నేర చరిత్ర గురించి, పాత కేసుల గురించి, చట్ట విరుద్ధ కార్యకలాపాల గురించి ఏకరవు పెట్టారు. ఆంధ్రజ్యోతి సహా పలు పత్రికలు, టీవీ ఛానళ్లలో వారి గురించి వరుస కథనాలు వచ్చాయి. అయినా, పోలీసులలో ఆశించిన స్పందన లేదు.

ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని అన్నారు. మిగిలినవారిని గుర్తించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని కూడా అన్నారు. 'అంతా పద్ధతి ప్రకారం జరుగుతోంది..' అని పోలీసు బాస్ ప్రొసీజర్ వివరించారు. ఆ మాటలకు అర్థం వేరే అని తేలిపోయింది. గల్లీ రౌడీలను పట్టుకునేందుకు 'ప్రత్యేక బృందాల ఏర్పాటు' అన్నమాటే చోద్యం..! ఇద్దరు కానిస్టేబుళ్లకు అప్పగిస్తే లాక్కొచ్చి న్యాయస్థానం ఎదుట నిలబెట్టగలరు. అంత సత్తా పోలీసులకు ఉంది. కానీ చట్టానికి బద్ధులు కాకుండా, పాలకులకు బద్ధులు కావడమే అసలు సమస్య. పోలీస్ స్టేషన్లకు వెళ్లి వారి సిబ్బందిపైనే దాడి చేసిన ఘటనలు, బెదిరించిన ఘటనలు ఈ జిల్లాలో గత కొన్నేళ్లుగా చూస్తున్నాం. ఆ ఘటనలనే సీరియస్‌గా తీసుకోని పోలీసులు.. వేరే వ్యవస్థల్లో ఉండేవారికోసం చట్టబద్ధంగా పనిచేస్తారని ఆశించడం అత్యాశే..!

ఆ ఒక్కడినే..

సిద్ధం సభలో దాడికి పాల్పడిన వారిలో కూడేరు మండలం మరుట్ల గ్రామానికి చెందిన మిద్దె ఎర్రిస్వామిని మాత్రమే పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పపారు. కనగానపల్లి మండలం కోనాపురం గ్రామానికి చెందిన బండి రవి కోసం ఒక్క రోజు మాత్రమే పోలీసులు వెతికారు. కోనాపురంలోని అతని ఇంటివద్దకు వెళ్లి ఆరా తీశారు. లేడని తెలియడంతో ఫోన్ చేశారు. 'అనంతపురంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఇంటివద్ద ఉన్నా.. కావాలంటే లోకేషన్ పెడతా చూడండి..' అని అతడి నుంచి బరితెగింపు సమాధానం వచ్చింది. ఆ సవాలును స్వీకరించకుండా, పోలీసులు స్టేషన్ ముఖం పట్టారు. ఆ తరువాత బండి రవి కోసం ప్రయత్నించిన దాఖలాలు లేవు. బండి రవి అనంతపురంలోనే ఉంటున్నాడు. కుటుంబ సభ్యులు తరచూ వెళ్లి కలిసి వస్తున్నారు. అతని ముందస్తు బెయిల్ కోసం అధికారపార్టీవారు ప్రయత్నాలు చేస్తున్నారు.

అర్థాలే వేరు..

ఫొటో జర్నలిస్టు శ్రీకృష్ణపై దాడికిపాల్పడిన వారిలో ఆరుగురిని గుర్తించామని ఎస్పీ అన్బురాజన్ ప్రకటించారు. వారిని అరెస్టు చేసేందుకు

ఆ ఇద్దరూ ఇంటివద్దనే...

శ్రీకృష్ణపై దాడికి పాల్పడినవారిలో కళ్యాణదుర్గం మున్సిపాలిటీ దొడగట్ట గ్రామానికి చెందిన గొల్ల అశోక్, కళ్యాణదుర్గం మండలం బోయలపల్లికి చెందిన కురుబ నాగేంద్ర ఉన్నారు. దాడి జరిగిన మరుసటి రోజున దొడగట్ట గ్రామానికి పోలీసులు వెళ్లారు. అశోక్ కోసం ఆరా తీశారు. ఇంటి వద్ద లేకపోవడంతో అతని ద్విచక్రవాహనాన్ని ట్రాక్టర్‌లో తెచ్చి కళ్యాణదుర్గం పోలీస్ స్టేషన్ ఆవరణలో పెట్టారు. కురుబ నాగేంద్ర కోసం బోయలపల్లికి వెళ్లారు. అతను ఊళ్లో లేడని వెనక్కి వచ్చేశారు. అంతే..! ఇక ఆ ఇద్దరి కోసం పోలీసులు ప్రయత్నించిన దాఖలాలే లేవు. పట్టుకోవాలన్న ఆలోచనే కనిపించడం లేదు. అశోక్, నాగేంద్ర.. ఇద్దరూ స్వగ్రామాల్లోనే ఉన్నారని, స్వేచ్ఛగా తిరుగుతున్నారని స్థానికులు చెబుతున్నారు. వారిద్దరి సెల్ ఫోన్లు కూడా ఆన్‌లోనే ఉన్నాయని పక్కా సమాచారం. పోలీసులపై ఎంత నమ్మకం ఉంటే ఇంత ధీమాగా తిరగ్గలరు? త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ వస్తుంది. సాధారణంగా నేర చరిత్ర ఉన్న అందరినీ ఎన్నికల సమయంలో బైండోవర్ చేస్తారు. పరిస్థితులను చూస్తుంటే అధికార పార్టీ వారు శ్రీకృష్ణపై దాడి చేసినవారికి 'ఎన్నికల ప్రత్యేక విధులు' కేటాయించేలా ఉన్నారు.

ఎవరో.. వారెవరో..



సిద్ధం దాడి కేసులో ఇప్పటిదాకా మిద్దె ఎర్రిస్వామి, బండి రవి, గొల్ల అశోక్, కురుబ నాగేంద్ర పేర్లే బయటకు వచ్చాయి. 'ఆరుగురిని గుర్తించాం..' అని ఎస్పీ మొదట్లోనే ప్రకటించారు. మిగిలిన ఆ ఇద్దరు ఎవరో తెలియడం లేదు. ఇప్పటిదాకా గుర్తించని మిగిలినవారు ఎవరో అంతకన్నా తెలియదు. 'దీన్నిబట్టి చూస్తే.. ఆ నలుగురితోనే కథ ముగించేలా ఉన్నారు..' అని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటిదాకా జరిగింది సామాన్య ప్రజల దర్యాప్తే తప్ప.. పోలీసు దర్యాప్తు కాదు అని విపక్షాలు విమర్శిస్తున్నాయి. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న రాప్తాడు సీఐ మునిస్వామిని 'ఎంతవరకూ వచ్చింది సర్..?' అని అడిగితే.. 'అందరినీ గుర్తిస్తాం.. అరెస్టు చేస్తాం. చట్టపరంగా చర్యలు తీసుకుంటాం..' అని అన్నారు. 'ఎప్పుడు..?' అన్నదే ప్రశ్న.



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి తిరునాళ్ల

గార్లదిన్నె, మార్చి 3: మండలంలోని కోటంక సమీపంలో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి తిరునాళ ఆదివారం వైభోపేతంగా జరిగింది. స్వామివారి ఉత్సవాలు ప్రతి ఏడాది మాఘమాసంలో ప్రతి ఆదివారం జరుగుతాయి. ఈక్రమంలో మాఘమాసం చివరి ఆదివారం కావడంతో స్వామి దర్శనానికి జిల్లా నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు సుబ్రహ్మణ్యేశ్వర నామస్మరణతో మార్మోగాయి.

2,73,820 మందికి పోలియో చుక్కలు

అనంతపురం టౌన్, మార్చి 3: పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం జిల్లాలో మొత్తం 2,79,980 మంది ఐదేళ్లలోపు చిన్నారులు ఉండగా.. వారిలో 2,73,820 మందికి (97.79 శాతం) పోలియో చుక్కలు వేశామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ.బీ. దేవి, డీఐఓ డాక్టర్ యుగంధర్ తెలిపారు. స్థానిక కోర్టు రోడ్డులోని నెహ్రూ పాఠశాలలో పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించిన వీరు మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 1,782 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సోమ, మంగళవారాల్లో వైద్యసిబ్బంది ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేస్తారన్నారు. కార్యక్రమంలో జడ్పీచైర్ పర్సన్ గిరిజమ్మ, మేయర్ వసీం, జడ్పీసీఈఓ వైఖోల్ నిదియా దేవి, నగరపాలక కమిషనర్ మేఘస్వరూప్ పాల్గొన్నారు.



చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న జడ్పీ సీఈఓ

నేటి రా.. కదలిరాకు తరలిరండి

మాజీ మంత్రి పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి, మార్చి 3: పెనుకొండ సమీపంలోని కియా పరిశ్రమ వద్ద సోమవారం మధ్యాహ్నం నిర్వహించే రా కదలిరా బహిరంగసభకు రాప్తాడు నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీ శ్రేణులు భారీగా తరలిరావాలని మాజీ మంత్రి పరిటాల సునీత పిలుపు నిచ్చారు. స్థానిక టీడీపీ కార్యాల యంలో ఆదివారం ఆమె మాట్లాడుతూ... ఆ సభకు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు హాజరవు తున్నారన్నారు. సీఎం జగన్ పోలీసులను అడ్డం పెట్టుకుని జనాన్ని బలవంతంగా సిద్ధం సభలకు తరలించి.. సభ విజయ వంతం అయినట్లు చెప్పుకున్నా రన్నారు. దానికి మించిన రీతిలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు స్వచ్ఛందం గా రా కదలిరా సభను వచ్చి విజయ వంతం చేయాలని కోరారు. సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి, కుంటిమద్ది రంగయ్య, రామ్మూర్తినాయుడు, ముత్యా లప్ప, రామచంద్రారెడ్డి, బండారు బార్గవ, జెన్న నాగార్జున, కోళ్ల సూరి, ఐటీడీపీ పవన్, నారాయణరెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.



పరిటాల సునీత సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక : రామగిరి మండలం శేషంపల్లి గ్రామానికి చెందిన పలు వురు వైసీపీ నాయకులు సీకేపల్లిలోని టీడీపీ కార్యాల యంలో ఆదివారం పరిటాల సునీత సమక్షంలో టీడీపీలోకి చేరారు. వారిలో శేషంపల్లికి చెందిన చిదిగొండ్ల శివయ్య, చిత్రాగోపాల్, ప్రసాద్, అనిల్, చెన్నేకొత్తపల్లికి చెంది న బీజేపీ మాజీ మండల కన్వీనర్ జిలకర కార్తీక్ ఉన్నారు.

బండారు శ్రావణిశ్రీకి శుభాకాంక్షల వెల్లువ

శింగనమల, మార్చి 3: శింగనమల నియోజక వర్గం టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణిశ్రీకి నాయ కులు, కార్యకర్తలు, అభిమానుల నుంచి శుభాకాం క్షలు వెల్లువెత్తాయి. అనంతపురంలోని ఆమె స్వగృ హం వద్ద శింగనమల మండల టీడీపీ కన్వీనర్ గుత్తా ఆదినారాయణ, మాజీ జడ్పీ టీసీ షాలిని, చితంబరిదొర, రహితుల్లా, గుర్రం లక్ష్మినారాయణ, గొగుల నాగభూషణ, చెన్న య్య మాసుల చంద్ర గజమాలతో ఆమెను సత్కరించారు.

కాల్వను కలసిన బండారు శ్రావణిశ్రీ

జిల్లా అనంతపురం పార్లమెంట్ టీడీపీ పార్టీ అధ్యక్షుడు కాల్వ శ్రీనివాసులను శింగనమల టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ ఆదివారం అనంత పురంలో మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో తమ గెలుపునకు సహకరించాలని ఆమె కాల్వను కోరారు.

పెనుగొండ సభావేదిక పరిశీలన

పెనుగొండ కియా పరిశ్రమ వద్ద సోమవారం నిర్వహించే రా.. కదలిరా కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని శింగనమల నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ పిలుపుని చ్చారు. ఆదివారం కియ పరిశ్రమ వద్ద సభ వేదిక ను జిల్లా నాయకులతో కలిసి ఆమె పరిశీలించారు. అభిమానులందరూ తరలిరావాలని కోరారు.



ఉమ్మడి జిల్లా నాయకులతో కలిసి పెనుగొండ సభ వేదికను పరిశీలిస్తున్న బండారు శ్రావణిశ్రీ

అధికారంలోకి రాగానే డంపింగ్ యార్డు తరలిస్తాం : వైకుంఠం

అనంతపురం అర్బన్, మార్చి 3: టీడీపీ అధికారంలోకి రాగానే డంపింగ్ యార్డును ఇతర ప్రాంతానికి తరలిస్తా మని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి హామీ ఇచ్చారు. ఆదివారం స్థానిక గుత్తి రోడ్డులోని డంపింగ్ యార్డును పలువురు టీడీపీ నాయకులతో కలిసి పరిశీలిం చిన ఆయన మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో అనంత వెంకట రామిరెడ్డి వైసీపీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే డంపింగ్ యార్డును తరలిస్తామని, ఆరు మాసాల్లో అండర్ డ్రైనేజీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం వైసీపీ పాలన ముగుస్తున్నా ఇప్పటి దాకా ఆ రెండు హామీలు నెరవేర్చలేక పోయారని విమర్శించారు. డంపింగ్ యార్డులో అగ్ని ప్రమాదం జరగడంతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, యార్డును తగలపెట్ట డంపై అనేక అనుమానాలు ఉన్నాయని, దానిపై విచారణ చేపట్టాలని అన్నారు. రూ.26 కోట్లతో ఒక కాంట్రాక్టర్ బయో మైనింగ్ చేశానని డబ్బులు డ్రా చేసుకున్నారని, ఇందులో పెద్ద కుంభకోణం జరిగిందని, టీడీపీ అధికారంలోకి రాగానే ఈ వ్యవహారంపై విచారణ జరిపిస్తామని అన్నారు. ఆయన వెంట నాయకులు సరిపూటి రమణ, నారాయణస్వామి యాదవ్, మారుతీకుమార్ గౌడ్, సుధాకర్ యాదవ్, అజీజ్, పూల బాషా, సతీష్ ఉన్నారు.



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న ప్రభాకర్ చౌదరి

తిరిగి టీడీపీలో చేరిక

ఆత్మకూరు : స్థానిక టీడీపీ నాయకుడు, 8వ వార్డు మెంబరు చాకలి ఎర్రిస్వామి ఆదివారం తిరిగి టీడీపీలో చేరారు. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆదివారం ఉదయం గ్రామ సచివాలయంలో ఎర్రిస్వామిని వైసీపీలోకి బలవంతంగా చేర్చుకున్నారు. మధ్యాహ్నం టీడీపీ మండల ఇన్‌చార్జి బాలాజీ, మాజీ కన్వీనర్ వేణుగోపాల్ సమక్షంలో ఆయన తిరిగి టీడీపీలో చేరారు.కార్యక్రమంలో హిందూపురం పార్లమెంటు అధికార ప్రతినిధి శశాంక చౌదరి, వార్డు మెంబరు జగదీష్, నాయకులు రఫీ, నారాయణ, ఆనంద్, పోతన్న, లక్ష్మీదేవి పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన చాకలి ఎర్రిస్వామి

టీడీపీ గూటికి బంగి మల్లేష్

ధర్మవరంరూరల్, మార్చి 3: కనగానపల్లి మండలం తూముచెర్ల సర్పంచ్ బంగిరేణుక భర్త బంగిమల్లేష్ టీడీపీ గూటికే చేరారు. ఈ నెల2న రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి బంగిమల్లేష్‌కు వైసీపీ కండువా కప్పాడు. అయితే 24 గంటలు గడవకముందే ఆదివారం అనంతపురంలో పరిటాల శ్రీరామ్‌ను కలిసి తన నిర్ణయం మార్చుకుని ఆయన చేతుల మీదుగా టీడీపీ కండువా కప్పుకున్నారు. బంగి మల్లేష్ మాట్లా డుతూ... భూవివాదాల్లో ప్రకాష్‌రెడ్డి తనను మభ్యపెట్టి పార్టీలోకి చేర్చుకున్నారని, టీడీపీలో నే ఉంటానని తెలిపారు. పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్‌లు బంగిమల్లేష్‌కు ధైర్యం చెప్పి ఎవరికి భయపడాల్సిన అవసరం లేదని, వచ్చేది తెలుగుదేశం ప్రభుత్వమేనని తప్పకుండా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. భూవివాదాలు, ఆస్తి తగాదాలను అడ్డంపెట్టు కుని బెదిరించి బలవంతంగా కండువాలు వేస్తే అవి ఎక్కువ సేపు నిలబడవని ప్రకాష్‌రెడ్డికి పరిటాలశ్రీరామ్ హితువు పలికారు. ఇలా నియోజకవర్గవ్యాప్తంగా టీడీపీ కార్యకర్త లను, నాయ కులను భయభ్రాంతులకు గురిచేసి వైసీపీలోకి చేర్చు కుంటున్నారని మండిపడ్డారు. కార్యక్ర మంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేష్, మండల కన్వీనర్ యాతం పోతలయ్య, ముకుంద నాయుడు, మల్లికార్జున, నాగభూషణ, నరసప్ప, చెన్నప్ప పాల్గొన్నారు.



బంగిమల్లేష్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న పరిటాలశ్రీరామ్

మాజీ జడ్పీటీసీ ఆధ్వర్యంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న విశాలాక్షి, విజయ్ భాస్కర్

గార్లదిన్నె, మార్చి 3: గార్లదిన్నె మండలం కోటంక గ్రామ సమీపంలోని శ్రీ గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి తిరునాళ్ల సందర్భంగా ఆదివారం మాజీ జడ్పీటీసీ, గాండ్ల తెలుకుల సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ విశాలాక్షి, భాస్కర్ ఫర్టిలైజర్ లిమిటెడ్ నిర్వహకుడు విజయ్‌భాస్కర్ దంపతులు అన్నదానం, తాగునీటి సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఈఓ బాబు, తదితరులు పాల్గొన్నారు. తిరునాళ్ల సందర్భంగా తిరుమల హాస్పిటల్ సహకారంతో వీరు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది.

రాష్ట్ర సచివాలయాన్నే తాకట్టు పెట్టిన సీఎం

అనంతపురం అర్బన్, మార్చి 3: సీఎం జగన్‌రెడ్డి రాష్ట్ర సచివాలయాన్నే తాకట్టుపెట్టారని, దేశ చరిత్రలో ఇలాంటి సీఎంను ఎక్కడైనా చూశారా..? అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గాజుల ఆదెన్న ఆదివారం ఆయన ఒక ప్రకటనలో మండిపడ్డారు. రూ.370 కోట్లకు ఏపీ రాష్ట్ర పాలనా కేంద్రాన్ని తాకట్టు పెట్టడమంటే.. తెలుగు ప్రజల ఆత్మగౌరవం, నమ్మకాన్ని తాకట్టుపెట్టినట్లేనన్నారు. ఇలాంటి సీఎం మరో సారి అధికారంలోకి వస్తే రాష్ట్ర ప్రజలు ఆస్తులు మిగలనివ్వడన్నారు. వైసీపీ పాలనలో జరుగుతున్న దుర్మార్గాలు, అరాచకాలను దృష్టిలో ఉంచుకొని రాబోవు ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఉమ్మడి కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు.

అనంతవాసులకు జాషువా పురస్కారాలు

అనంతపురంకల్చరల్: అనంత పురం జిల్లాకు చెందిన సాహితీ కారులు దాసరి ఆదినారాయణ, అంకె రామలింగయ్య జాషువా పురస్కారాలు అందుకున్నారు. గుర్రం జాషువా స్మారక కళా పరిషత్ 36వ వార్షికోత్సవాన్ని పుర స్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా పలువురిని ఈ పురస్కారాలకు ఎంపిక చేశారు. జిల్లా తరపున పురస్కారాలకు ఎంపికైన దాసరి ఆదినారాయణ, డాక్టర్ అంకె రామలింగయ్యకు ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో పురస్కారాలతో పాటు గౌరవ డాక్టరేట్ అందజేశారు.



పురస్కారం అందుకుంటున్న దాసరి, అంకె రామలింగయ్య

నేషనల్ అకాడమీకి శాన్వి ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్: నేషనల్ అకాడమీకి జిల్లాకు చెందిన టేబుల్‌టెన్నిస్ క్రీడాకారిణి శాన్వి ఎంపికైంది. ఢిల్లీలోని సోనిపట్‌లో ఉన్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశానికి ప్లేయర్స్ స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డ్‌లో శాన్వి అర్హత సాధించింది. అటు టేబుల్ టెన్నిస్, ఇటు ఉన్నత చదువు వరకు నేషనల్ అకాడమీ భరిస్తుంది. ఆదివారం అనంతపురం క్లబ్ సభ్యులు శాన్విని సన్మానించారు. ఇందులో అనంతపురం క్లబ్ , జిల్లా టేబుల్‌టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి కేశవరెడ్డి, అధ్యక్షుడు మురళీధర్‌రావు, సభ్యులు రాజశేఖర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, జనార్ధన్‌రెడ్డి, పాండురంగయ్య, శాప్ కోచ్ ధనుంజయ రెడ్డి పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు

ఆత్మకూరు మార్చి 3: మండలంలోని పంప నూరు సుబ్రమ్మణ్యేశ్వర ఆలయంలో నాల్గో ఆదివారం మాఘమాస ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీ చాయ ఉష సమేత శ్రీ సూర్యనారాయణస్వామి ప్రసన్నం కోసం సూర్య నమస్కారాలు, అరుణ హోమం నిర్వహించారు. అనంతరం సుబ్రహ్మణ్యశ్వర స్వామికి పలు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. కుజదోష, సర్పదోష రాహు కేత దోష, సర్పదోష, కాలసర్పదోష నివారణ పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి సాకేతపురం శోభ, ప్రధాన అర్చకుడు రాముస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.



తాగుబోతు దాడి - వృద్ధుడి మృతి

అనంతపురం క్రైం : స్థానిక వన్‌టౌన్ పరిధిలోని పవర్ ఆఫీస్ వద్ద మద్యం మత్తులో తాగుబోతు దాడి చేయడంతో బాలయ్య (72) మరణించాడు. స్థానిక రాజీవ్‌కాలనీలోని రాకేష్ అనాథ ఆశ్రమంలో ఉండే బాలయ్యకు మద్యం అలవాటు ఉంది. మద్యం సేవించేందుకు శనివారం రాత్రి పవర్ ఆఫీస్ వద్దకు వెళ్లారు. అయితే అప్పటికే మద్యం మత్తులో ఉన్న దూదేకుల రఫీ అనే వ్యక్తి బాలయ్యపై దాడి చేయడంతో అతను అక్కడికక్కడే మృతి చెందారు. కేసు దర్యాప్తులో ఉందని సీఐ రెడ్డప్ప తెలిపారు.

జూదరుల అరెస్ట్

నార్పల : బొందలవాడ గ్రామ సమీపంలో ఆదివారం కోడి పందెలు ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేశామని, వారి నుంచి రూ.8 వేలు స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. వారిని సోమవారం కోర్టులో హాజరుపరుస్తామని ఎస్‌ఐ తెలిపారు.

నార్పలలో దొంగల హల్‌చల్

నార్పలలో శనివారం అర్ధరాత్రి రెండు చోట్ల దొంగతనాలు జరిగాయి. నార్పలలోని పాత పోలీస్ క్వార్టర్స్ సమీపంలో ప్రదీప్‌కు చెందిన కారును బండరాయితో అద్దాలు పగలగొట్టి అందులో సామాన్లను ఎత్తుకెళ్లారు. అలాగే కొత్త బస్టాండ్ వద్ద ఉన్న బాషాకు చెందిన కోళ్ల ఫారంలో రూ.50 వేలు విలువ చేసే నాటు కోళ్లు, కోళ్ల స్టాండ్లను ఎత్తుకెళ్లారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రస్తా వివాదంలో ఘర్షణ

రామగిరి : మండలంలోని పేరూరు గ్రామంలో రస్తా విషయంలో ఇరువర్గాలు ఆదివారం సాయంత్రం ఘర్షణ పడ్డాయి. కొన్నేళ్లుగా రస్తా విషయంలో బడిగ నాగభూషణ, కురుబ ఆదిరెడ్డి వర్గీయుల మధ్య వివాదం నడుస్తోంది. అయితే రస్తా వద్ద కాలువపైకి రాతిబండలు వేసేందుకు కురుబ ఆదిరెడ్డి వర్గీయులు వచ్చారు. బండలు వేస్తుండగా బడిగ నాగభూషణ కుమారుడు వినయ్‌కుమార్ వారిని అడ్డుకోబోయారు. దీంతో ఇరువర్గాలు ఘర్షణకు దిగారు. ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడికి దిగారు. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు రామగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు.

ఎర్తింగ్ పైపు ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురంరూరల్ : మండలంలోని కక్కలపల్లి పంచాయతీ పరిధిలోని బీజేపీ కొట్టాల, ప్రజాశక్తి నగర్‌లో ఇళ్లకు కరెంటు సరఫరా అవుతోంది. దీంతో అనేక మంది గాయపడ్డారు. దీనిపై ఆంధ్రజ్యోతి ఆదివారం ఇంటింటికి కరెంటు అన్న శీర్షికతో కథనాన్ని ప్రచురించింది. దీనికి విద్యుత్ అధికారులు స్పందించారు. హుటాహుటిన ఆ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్తింగ్ పైపు ఏర్పాటు చేశారు. బాధిత ఇళ్ల వద్దకు వెళ్లి విద్యుత్ సరఫరాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ సోమశేఖర్ మాట్లాడుతూ.. విద్యుత్ పరమైన ఏమైన సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

యుద్ధవీరులకు సన్మానం

అనంతపురం ప్రెస్‌క్లబ్: యుద్ధం 1971లో పాల్గొన్న యుద్ధ వీరులను మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కెప్టెన్ షేకన్న, గౌరవాధ్యక్షుడు వీకే రంగారెడ్డి, మాజీ సైనికులు ఉమామహేశ్వరరావు, తిమ్మారెడ్డి, రంగారెడ్డి, హుస్సేన్ బాష, హుస్సేన్, ప్రసాద్, రవికుమార్, ఈశ్వరయ్య, నాగిరెడ్డి, నబీరసూల్, సురేష్, నాగరాజు పాల్గొన్నారు.

పది గొర్రెలు మృతి

ఆత్మకూరు : ఆత్మకూరు వాసి గొర్రెలు కాపరి కురువ లక్ష్మన్నకు చెందిన పది గొర్రెలు ఆదివారం ఒక్కసారిగా మరణించాయి. ఉదయం నుంచి గొర్రెలను బయలు పొలాల్లో తిప్పానని, సేద తీరుతాయని ఓ చెట్టు కిందకి తోలడంతో మందలోని పది గొర్రెలు ఒక్కసారిగా మరణించాయని లక్ష్మన్న వాపోయాడు. ప్రమాదానికి కారణాలు తెలుసుకోవడానికి వైద్యాధికారులు ల్యాబ్‌కు పంపారన్నారు. గొర్రెల మృతిలో తను రూ. 1.50 లక్షల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వమే తనను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

నేడు మెగా రక్తదాన శిబిరం

నార్పల: టీడీపీ జిల్లా నాయకులు, వెంకట్ వకుళ ఫౌండేషన్ చైర్మన్ ఆలం వెంకట నరసానాయుడు జన్మదినం పురస్కరించుకుని సోమవారం స్థానిక ఆలం క్యాంపు కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు టీడీపీ నాయకులు ఆదివారం తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రక్తదానం చేసి.. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి ప్రాణాలను కాపాడాలని కోరారు.

అధికారులపై అట్రాసిటీ కేసు పెడతాం

అనంతపురం సెంట్రల్ : దళితుల భూములను ఆక్రమించు కున్న వారికి అండగా నిలుస్తున్న అధికారులపై ప్రైవేట్ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును పెడతామని బహుజన లాయర్స్ ఫోరం (బీఎల్‌ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు నారాయణప్ప అన్నారు. వైసీపీ నాయకులు ఆక్రమించుకున్న రాప్తాడు మండల మరూరు గ్రామానికి చెందిన పెద్దక్క పొలాన్ని ఆదివారం పరిశీలించిన ఆయన మాట్లాడారు. సర్వే నెంబర్ 1094-1లో 1.20 ఎకరాల భూమిని పెద్దక్కకు ప్రభుత్వం డీపట్టా ఇచ్చిందని, 1995 నుంచి పెద్దక్క కుటుంబం సంబంధిత పొలంమీద ఆధారపడి జీవిస్తోందని అన్నారు. మరూరు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు పొలాన్ని ఆక్రమించుకుని బోరువేసుకుని ఐదేళ్లుగా అనుభవిస్తున్నారని మండిపడ్డారు. దీంతో బాధిత కుటుంబం గ్రామ రెవెన్యూ అధికారి నుంచి కలెక్టర్ వరకు పలుమార్లు ఫిర్యాదు చేసినా.. వారు వైసీపీ నాయకులకు అండగా నిలిస్తూ బాధితులకు న్యాయం చేయడం లేదన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సమస్యను పరిష్క రించని వారిపై ప్రైవేట్ అట్రాసిటీ కేసును పెట్టి, సివిల్ కోర్టులో దావావేసి బాధితులకు న్యాయం చేసేందుకు బీఎల్‌ఎఫ్ నిర్ణయించినట్లు తెలిపారు.

నిఘా పటిష్టం చేయండి: ఎస్పీ

అనంతపురం క్రైం : జిల్లా సరిహద్దులలో నిఘా పటిష్టం చేయాలని జిల్లా అదనపు ఎస్పీ జీ రామకృష్ణ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఆదివారం చెక్‌పోస్టు సిబ్బందికి నిరంతర నిఘా, తనిఖీలు, సీజర్స్‌పై పాటించాల్సిన విధి విధానాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఏఆర్ డీఎస్పీ మునిరాజ, ఏఈఎస్ శ్రీరాం, చెక్ పోస్టుల సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సుకు విద్యార్థుల ఎంపిక

అనంతపురం సెంట్రల్ : చెన్నైలో నిర్వహించనున్న అంతర్జాతీయ సదస్సుకు సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు ఎంపికయ్యారని ఆదివారం తెలుగు విభాగం అధ్యాపకుడు గురజాడ, అశోక్ కుమార్ ప్రకటనలో తెలిపారు. 'కవిత్రయ మహాభారతం- వర్తమాన సమాజం, సమాలోచన' అన్న అంశంపై మద్రాస్ యూనివర్సిటీలో 4 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించే సదస్సుకు విద్యార్థులు భానుశ్రీ, బాలు భీమ్‌రావు, మహాలక్ష్మి, అనిత పాల్గొంటారన్నారు.

స్పోర్ట్స్ మీట్

అనంతపురం క్లాక్‌టవర్ : స్థానిక ఫార్మసి కళాశాల మైదానంలో బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ ఆదివారం నిర్వహించారు. ఎన్‌వైకే అధికారులు మాట్లాడుతూ.. సోషల్ మీడియాను పక్కన పెట్టి క్రీడలపై, చదువు, భవిష్యత్తుపై దృష్టి సారించాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌వైకే సభ్యులు అసిస్టెంట్ ప్రొఫెసర్ నాగశుభ, రాష్ట్రపతి అవార్డు గ్రహీత జయమారుతి, పీడీ ప్రదీప్, సభ్యులు సంతోష్ నాయక్, కిరణ్‌సాయి, పవన్ పాల్గొన్నారు.

వాల్మీకి సంఘం ఎంపిక

రామగిరి, : మండలంలోని పెద్దకొండాపురం గ్రామంలో జిల్లా వాల్మీకి బోయ సంఘం ఆధ్వర్యంలో మండల కమిటీని ఆదివారం ఎంపిక చేశారు. మండల అధ్యక్షుడిగా ఎంసీపల్లి నాగభూషణ, యూత్ మండల అధ్యక్షుడిగా రామగిరి కిశోర్, ప్రధాన కార్యదర్శిగా బోయరాజు, కార్యదర్శిగా బోయనరసింహులు, ఈసీ మెంబరుగా సురేశ్‌ను ఎంపికచేశారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా నాయకులు కేశవ, నాగార్జున, గోవిందు, అఖిల్, పేరూరు మోహన, శివయ్య, కొండాపురం రామ్మూర్తి పాల్గొన్నారు.

ఇంజనీరు శ్రీరామకృష్ణయ్యకు నివాళి

అనంతపురం క్లాక్‌టవర్ హంద్రీనీవా సుజల స్రవంతి పథకం రూపశిల్పి ఇంజనీరు శ్రీరామకృష్ణయ్య జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక అంబేద్కర్ రోడ్డులోని తెలుగుతల్లి కూడలి వద్ద ఉన్న శ్రీరామ కృష్ణయ్య విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందులో రాయలసీమ జనచైతన్య వేదిక నాయకులు రామాంజి నేయులు, ఎస్సీ ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంఘం జాతీయ కార్యదర్శి రవిశంకర్, రచయి త బండి నారాయణస్వామి, కృష్ణమూర్తి, సమాచార హక్కు చట్టం హొన్నూరప్ప, వెంకటేష్, జైభారత్ నాయకులు కుళ్ళాయప్ప, అనంత హక్కుల పోరాట సంఘం రాహుల్ సభ్యులు పాల్గొన్నారు.

'అనితరుడు' పుస్తకావిష్కరణ

అనంతపురం కల్చరల్ : మువ్వా శ్రీనివాసరావు రాసిన కవితా సంపుటి 'అనితరుడు' పుస్తకావిష్కరణ సభను ఆదివారం స్థానిక గ్రంథాలయ సమావేశమందిరంలో నిర్వహించారు. ఇందులో దిగంబర కవి నగ్నముని, డాక్టర్ శాంతినారాయణ, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి, స్పందన అనంత కవుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖరశాస్త్రి పాల్గొన్నారు.

రేపటి 'జయహో బీసీ డిక్లరేషన్'ను విజయవంతం చేయండి



టీడీపీ పాపంపేట కార్యాలయంలో మాట్లాడుతున్న నాయకులు

అనంతపురంరూరల్, మార్చి 3: గుంటూరు జిల్లా మంగళగిరిలో నాగార్జున యూనివర్సిటీ ఎదుట మైదానంలో మాజీ మంత్రి కొల్లు ర వీంద్ర అధ్యక్షతన మంగ ళవారం నిర్వహించే టీడీపీ రాష్ట్రస్థాయి జయహో బీసీ డిక్లరేషన్ మహాసభను విజయవంతం చేయాలని కుమ్మర శాలివాహన సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మదనాపు పోతలయ్య కోరారు. ఆదివారం మండలంలోని పాపంపేటలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఆ మహాసభకు పార్టీ జాతీయ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నారా చంద్రబాబునాయుడు, నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చన్నాయుడు ఇతర పెద్దలు హాజరవుతారన్నారు. కుమ్మర్లు తమ ఐక్యత చాటుతూ కార్యక్రమానికి హాజరై జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సత్యసాయి జిల్లా కుమ్మర శాలివాహన సాధిక కమిటీ కన్వీనర్ రామాం జినేయులు, రాష్ట్ర డైరెక్టర్ ఓబులపతి, రాప్తాడు కన్వీనర్ నాగేంద్ర, నాయకులు మల్లికార్జున, వన్నూరు స్వామి, తిప్పయ్య స్వామి, కిష్ట, తేజ, నారాయణస్వామి పాల్గొన్నారు.

అనంతపురం అర్బన్ : మంగళగిరిలో మంగళ వారం నిర్వహించే రాష్ట్ర స్థాయి జయహో బీసీ సభకు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలని టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల కృష్ణయ్య కోరారు. స్థానిక టీడీపీ జిల్లా కార్యాల యంలో ఆయన మాట్లాడుతూ.. బీసీల అభ్యున్నతి పాటుపడిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని, మరో అడుగు ముందుకేసి జయహో బీసీ సభలో బీసీ డిక్లరేషన్‌ను విడుదల చేస్తారని అన్నారు. కార్యక్రమంలో ఓబులపతి, పెద్దన్న, రమేష్, నారాయణస్వామి పాల్గొన్నారు.



ఆవుల కృష్ణయ్య

రామగిరి : మంగళగిరిలో మంగళ వారం నిర్వహించే టీడీపీ జయహో బీసీ డిక్లరేషన్ మహాసభను విజయ వంతం చేయాలని బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య కోరా రు. ఆదివారం శ్రీహరిపురంలో ఆయన మాట్లాడుతూ.. ఈ మహాస భకు మం డలంలోని బీసీ నాయకులు, కమిటీ సభ్యులు తప్పక హాజరు కావాల న్నారు. ఈ సమావేశంలో టీడీపీ వాల్మీకి సాధికార కమిటీ అధ్యక్షుడు బోయ రామాంజినే యులు, బీసీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కొడపగానిపల్లి శివ, తెలుగు యువత మనో హర్, శంకర, మల్లెల ఆంజనేయులు, తిరుపాలప్ప, కొండపల్లి రాజ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కుంటిమద్ది రంగయ్య

'రా కదలిరా' ను జయప్రదం చేద్దాం

అనంతపురం అర్బన్, మార్చి 3: చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో పెనుకొండలో సోమవారం నిర్వహిం చే రా.. కదలిరా బహిరంగ సభను పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి... జయప్రదం చేయాలని టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకులు కేఎం జకీవుల్లా కోరారు. ఆదివారం అనంతపురంలోని తన నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంత అర్బన్ నియోజకవర్గంలో టీడీపీ బలాన్ని నిరూపించుకునేందుకు మరో అవకాశం వచ్చిందన్నారు. కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాయల్ మురళీ, నాయకులు కృష్ణకుమార్, మణికంఠ బాబు, నాగేంద్ర, డిష్ ప్రకాష్, మోహన్‌కుమార్, లక్ష్మీనాయుడమ్మ, మాధవ్ యాదవ్, జీలాన్, మునీర్, తిరుపాలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేఎం జకీవుల్లా

పశువుల సంత ఆదాయం రూ.2.97 లక్షలు

అనంతపురంరూరల్, మార్చి 3: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశువుల సంతతో మార్కెట్‌కు రూ.2,97,730 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా మార్కెట్‌కు రూ.1,55,100, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1,42,630 ఆదాయం వచ్చిందని తెలిపారు.

బీసీలకు వాటిల్లుతున్న అన్యాయాన్ని అరికడదాం

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 3: బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని అందరూ కలిసికట్టుగా అరికడుదామని పలు కుల, ప్రజా, ఉద్యోగ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 'బీసీలకు జరుగుతున్న సామాజిక అన్యాయంపై కుల సంఘాల పాత్ర-తక్షణ కర్తవ్యం' అనే అంశంపై చర్చావేదిక నిర్వహించారు. ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్టా శ్రీధర్ మాట్లాడుతూ... బీసీలకు విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో జనాభా దామాషా ప్రకారం అవకాశాలు కల్పించాలని, రానున్న ఎన్నికల నేపథ్యంలో బీసీలకు సముచిత ప్రాధాన్యతమిచ్చి వారి అభివృద్ధికి పాటుపడాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పిడుగు శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి శివప్రసాద్, రిటైర్డ్ జడ్జి క్రిష్టప్ప, ఫర్ ద సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు రాధాకృష్ణ, మేధావుల ఫోరం నాయకులు బండి నాగరాజు, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈజీ నాగభూషణం, ప్రజారక్షణ సమితి అధ్యక్షుడు శ్రీరాములు, ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర, ఏపీఎన్జీఓ నాయకులు శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.



చర్చావేదికలో ఐక్యత చాటుతున్న నాయకులు

శేషవాహనంపై కైలాసవాసుడు

అనంతపురం కల్చరల్, మార్చి 3: స్థానిక మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజున ఆదివారం స్వామివారు శేషవాహనంపై ఊరేగారు. ఉదయం మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం శేషవాహనంపై ఊరేగించారు. అనంతరం ఆలయ ఆవరణలోని వేదికపై ఓం సంగీత నృత్య శిక్షణాలయం ఆధ్వర్యంలో చిన్నారులు భరతనాట్యం, కూచిపూడి నృత్యాలతో స్వామివారికి నృత్యనీరాజనం పలికారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమేష్‌బాబు, అనువంశీకుడు హోసూరు రామసుబ్రహ్మణ్యం, ధర్మకర్తల మండలి సభ్యులు కల్పన, రాజేశ్వరి, వెంకటస్వామి, సురేష్‌బాబు, తిమ్మారెడ్డి, చంద్రశేఖర్, డి.సుబ్రహ్మణ్యం, ప్రధానార్చకుడు నరసింహశాస్త్రి, పరమేష్, భక్తులు పాల్గొన్నారు.



శేషవాహనంపై విహరిస్తున్న కైలాసవాసుడు, నృత్యనీరాజనంలో పాల్గొన్న ఓం సంగీత నృత్య కోలాట శిక్షణ బృందం

పదో తరగతి విద్యార్థులకు శిక్షణా తరగతులు

అనంతపురం ప్రెస్‌క్లబ్ : నగరంలోని ఎస్సీ నెం-4 బాలుర హాస్టల్‌లో పదో తరగతి విద్యార్థులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఆదివా రం ఎస్సీ సంక్షేమశాఖ జేడీ మధుసూదన్‌రావ్ విద్యార్థులకు పలు పా ఠాలు బోధించారు. సమయాన్ని వృథా చేయకుండా విద్యార్థులు చదువు కోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూఓ దామోదర్ రెడ్డి, వార్డెన్లు లక్ష్మీనారాయణ, నాగార్జునరెడ్డి, శారద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి



సాయిచరణ్(ఫైల్)

ఉరవకొండ, మార్చి 3: మండలంలోని పెన్నహోబిలం ఏటి గంగమ్మ సమీపంలో ఆదివారం సాయిచరణ్(17) అనే విద్యార్థి ఈతకువెళ్లి మృతి చెం దాడు. ఉరవకొండ పట్టణం ఇందిరానగర్‌లో ఉంటున్న రాజేశ్వరి, రమేష్ దం పతుల కుమారుడైన సాయిచరణ్ గుంతకల్లులోని నారాయణ కళాశాలలో ఇం టర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మాఘమాసం నాల్గవ వారం కావడంతో కుటుంబసభ్యులతో కలిసి ఏటిగంగమ్మకు వెళ్లారు. స్నానం చేసేందుకు నిల్వ ఉన్న కుంట వద్దకు వెళ్లారు. ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడిపోయాడు. స్థానికులు గుర్తించి మునిగిపోతున్న విద్యార్థిని బయటకు లాగారు. హుటాహుటిన చికిత్స కోసం ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

రా.. కదలిరాకు సర్వం సిద్ధం



సభ ఏర్పాట్లు

- నేడు కియ వద్ద భారీ బహిరంగసభ
- హాజరుకానున్న టీడీపీ అధినేత చంద్రబాబు
- లక్ష మందితో సభకు ఏర్పాట్లు
- అభ్యర్థులను ప్రకటించాక ఉమ్మడి అనంతలో తొలిసభ
- ఏర్పాట్లను పరిశీలించిన నేతలు

హిందూపురం/పెనుకొండ రూరల్, మార్చి 3: తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రా కదిలిరా సభ సోమవారం పెనుకొండ సమీపంలోని కియ పరిశ్రమవద్ద ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హాజరుకానున్నారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలు, అరాచకాలు, దౌర్జన్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా ఆయన టీడీపీ నేతలు, కార్యకర్తలకు దిశ నిర్దేశం చేయనున్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఉమ్మడి జిల్లా అభివృద్ధికి ఏం చేస్తారో వివరించనున్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రకటనకు ముందు నిర్వహిస్తున్న భారీ బహిరంగసభ కావడంతో ఉమ్మడి జిల్లా టీడీపీ నేతలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని జనసమీకరణ చేస్తున్నారు. పెనుకొండ టీడీపీ అభ్యర్థి సవితతోపాటు ఉమ్మడి జిల్లా నేతలు సభకు సర్వం సిద్ధం చేశారు.

తరలిరానున్న కార్యకర్తలు

రా.. కదిలిరా సభకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి నేతలు, కార్యకర్తలు తరలి రానున్నారు. ఇందుకు సంబంధించి నియోజకవర్గ బాధ్యులు, ముఖ్యనేతలు జనసమీకరణలో నిమగ్నమయ్యారు. వచ్చే ఎన్నికల్లో జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాలతోపాటు పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకుని పార్టీకి పూర్వవైభవం తెచ్చేందుకు ఈ సభ ద్వారా శ్రీకారం చుడతామని నాయకులు పేర్కొన్నారు. వైసీపీ పాలనతో విసిగిపోయిన ప్రజలు భారీ ఎత్తున తరలి వచ్చి చంద్రబాబుకు అండగా నిలుస్తారని పేర్కొన్నారు. టీడీపీ, జనసేన పొత్తు ఖరారై, సీట్లు ప్రకటించిన తర్వాత జిల్లాకు మొదటిసారిగా చంద్రబాబు విచ్చేయనున్నారు. దీంతో ఈసభకు టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు కూడా హాజరుకానున్నారు. ఈసభ ఇరుపార్టీల కార్యకర్తల్లో జోష్ నింపుతుం దని నేతలు అభిప్రాయపడుతున్నారు.



మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు, సవిత, పరిశీలకులు

లక్ష మందితో సభ

కియ వద్ద జరగనున్న రా కదిలిరా ముగింపు సభకు లక్షమందిని తరలించేవిధంగా ఏర్పాట్లు చేశారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో చంద్రబాబు నిర్వహించే ఈ కార్యక్రమం ఎన్నికల సభగా ఉంటుందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. సభ ఏర్పాట్లను ఆదివారం ఉమ్మడిజిల్లాల పార్టీ అధ్యక్షులు బీకే పార్థసారథి, కాలవ శ్రీనివాసులు, మాజీ మంత్రులు పరిటాల సునీత, పల్లె రఘునాథ్‌రెడ్డి, పెనుకొండ టీడీపీ అభ్యర్థి సవిత, శింగనమల అభ్యర్థి శ్రావణి, జిల్లా పరిశీలకులు కోవెలముడి రవీంద్ర, పెనుకొండ పరిశీలకులు నరసింహారావు, టీడీపీ నాయకులు దేవళ్ల మురళి, సామకోటి ఆదినారాయణ, ఎల్.నారాయణ చౌదరి, రంగయ్య, తదితరులు పరిశీలించారు. కాగా బహిరంగ సభకు విచ్చేసే వారందరికీ సవిత ఆధ్వర్యంలో భోజన, తాగునీటి వసతి ఏర్పాటు చేసినట్లు స్థానిక నాయకులు తెలిపారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న పరిటాల సునీత, పల్లె, పార్థసారథి



హెలీప్యాడ్‌ను పరిశీలిస్తున్న నాయకులు

జగన్‌ను ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధం



ప్రజలంతా వైసీపీ పాలన ఎప్పుడు పోతుందా అని ఎదురు చూస్తున్నట్లు పేర్కొన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా జరగలేదన్నారు. చంద్రబాబు అభివృద్ధి ఏంటన్నది ఒక్క కియ పరిశ్రమను చూపితే చాలన్నారు. అందుకే ఇక్కడే రా.. కదలిరా సభను ఏర్పాటు చేసినట్లు వివరించారు. జగన్ పాలనలో అన్ని ప్రాంతాల్లో భూ మాఫియాలు పెరిగిపోయాయి. అందుకే ఆ పార్టీని ఇంటికి పంపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి అనంతపురం జిల్లాలో 14అసెంబ్లీ స్థానాలు, రెండు పార్లమెంట్ స్థానాలు, టీడీపీ క్లీన్‌స్వీప్ చేస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

- పరిటాల సునీత, మాజీమంత్రి

ఇక్కడ సభ.. అదృష్టంగా భావిస్తున్నాం



రా కదిలిరా ముగింపు మహాసభ ఇక్కడ నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నాం. చంద్రబాబు చలువతోనే కియ కార్ల పరిశ్రమ, పవన్ విద్యుత్ కేంద్రాలు జిల్లాలో ఏర్పాటయ్యాయి. కరువు జిల్లా అయిన ఉమ్మడి అనంతను ఆదుకోవాలనే సంకల్పంతోనే దేశంలోని పలు రాష్ట్రాలు పోటీపడినా అంతర్జాతీయ కియ కార్లపరిశ్రమను ఈ ప్రాంతానికి తెచ్చారు. కియ రాకతో 13వేల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు. గొల్లపల్లి రిజర్వాయర్ ఏర్పాటు చేసి తాగు, సాగునీటిని అందించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుంది. మన అందరి కోసం పాటుపడే మన నాయకుడు చంద్రబాబు వస్తున్న సందర్భంగా అన్నివర్గాల ప్రజలు రా కదిలిరా కార్యక్రమానికి పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేద్దాం.

- పల్లె రఘునాథ్‌రెడ్డి, మాజీ మంత్రి

అభివృద్ధి, సంక్షేమం తెలిసిన వ్యక్తి చంద్రబాబు



రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం తెలిసిన ఏకైక వ్యక్తి చంద్రబాబు. రాష్ట్రం విడిపోయి ఇబ్బందుల్లో ఉన్న సమయంలో నవ్యాంధ్ర సీఎంగా బాధ్యతలు చేపట్టి రాష్ట్రాన్ని ముందుకు నడిపిన విజన్ ఉన్న నాయకుడు ఆయన. అంతర్జాతీయ కియ కార్లపరిశ్రమ ఈ ప్రాంతంలో స్థాపించడం చంద్రబాబు కృషి అమోఘం. రా కదిలిరా సభను పెనుకొండలో నిర్వహించడం, టీడీపీ, జనసేన పొత్తులో భాగంగా ఎమ్మెల్యే అభ్యర్థిగా నన్ను నియమించడం ఎంతో అదృష్టం. జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు కుదేలయ్యాయి. వైసీపీకి నాయకులు లేరు. అందుకే వలస పక్షులను ఇక్కడ పోటీకి దింపారు. ఇది ఆ పార్టీకి సిగ్గు చేటు. కళ్యాణదుర్గంలో ప్రజలు ఛీకొడితే ఓ వలస పక్షి వచ్చి పెనుకొండలో మకాం వేసింది.

- సవిత, పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి

అన్ని రంగాలు నిర్వీర్యం



ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో అన్ని రంగాలు నిర్వీర్యమైపోయాయి. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం జరగాలంటే మళ్లీ చంద్రబాబే ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రా కదిలిరా కార్యక్రమానికి జిల్లాలో అన్ని వర్గాల ప్రజలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలి. కార్యక్రమంలో ఎల్. నారాయణచౌదరి, రామ్మూర్తినాయుడు, దేవేళ్ల మురళి, సామకోటి ఆదినారాయణ, మాజీ సర్పంచ్ గుట్టూరు సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

- బీకే పార్థసారథి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

సీమ నీటి హక్కులపై కవి సమ్మేళనం



సమావేశంలో మాట్లాడుతున్న హరి

పెనుకొండ, మార్చి 3: రాయలసీమ నీటి హక్కులపై సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో స్థానిక గగన్ మహల్‌లో జలకవచం కవి సమ్మేళనం నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్ర మానికి సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ హరి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా రాయలసీమ జలసాధన సమితి అధ్యక్షులు బొజ్జ దశరథరామిరెడ్డి, సాహితీస్రవంతి రాష్ట్ర అధ్యక్షులు మోహన్, కవి ఏలూరి యంగన్న, సడ్లపల్లి చిదంబర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కవులు, రచయితలు తమ మాటలు, పద్యాలు, కవితల ద్వారా రాయలసీమ ఎదుర్కొంటున్న నీటి కరువు గురించి వివరించాలన్నారు. రాయలసీమ అడుగుతున్న నీటి హక్కులు ప్రాంతీయతత్వం కాదన్నారు. కార్యక్రమంలో రాయలసీమ జిల్లాల నుంచి వచ్చిన అనేక మంది కవులు, గాయకులు తమ కవితలను, పద్యాలను వినిపించారు. అనంతరం అతిథులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో సాహితీస్రవంతి సభ్యులు రాజశేఖర్‌రెడ్డి, కోగిర జయచంద్ర, రామన్న, యూటీఎఫ్ నాయకులు సుధాకర్, నారాయణస్వామి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గూటికి మధు?

ఉరవకొండ అసెంబ్లీ టిక్కెట్టు కోసం దరఖాస్తు



ఉరవకొండ, మార్చి3: మాజీ ఎమ్మెల్యే వై విశ్వేశ్వరరెడ్డికి సోదరుడి రూపంలో సవాలు ఎదురు కానుంది. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ఓట్లను చీల్చే కార్యక్రమానికి సొంత సోదరుడే శ్రీకారం చుట్టనున్నట్లు సమాచారం. వైసీపీ ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త విశ్వేశ్వరరెడ్డి సోదరుడు, మధుసూదన్‌రెడ్డి త్వరలో కాంగ్రెస్‌లో చేరనున్నట్లు సమాచారం. ఉరవకొండ అసెంబ్లీ టిక్కెట్టు కేటాయించాలని కోరుతూ ఆ పార్టీ అధిష్ఠానికి ఇటీవల ఆయన దరఖాస్తు చేసుకున్నారు. 2022 డిసెంబరులో ఉరవకొండలో జరిగిన నియోజకవర్గ సమావేశంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న మధుసూదన్‌రెడ్డి తన అన్న విశ్వపై బహిరంగగా ఆరోపణలు చేశారు. 'ఒకడే ఉండాలి, నేనే గెలవాలి అనే ఉద్దేశంతో ఓ నాయకుడు ఉండటం వల్లే గత ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయింది' అని అన్నారు. పార్టీలో కష్టపడిన కార్యకర్తలకు అన్యాయం జరుగుతోందన్నారు. దీంతో ఏడాది కిందట మధుసూదన్‌రెడ్డిని వైసీపీ నుంచి బహిష్కరించారు. ఆయన కొంత కాలం రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. షర్మిల కాంగ్రెస్ పార్టీ పగ్గాలు చేపట్టడం, రాజశేఖర్‌రెడ్డి కుటుంబంతో ఉన్న సాన్నిహిత్యం నేపథ్యంలో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. ఆ మేరకు జిల్లా పర్యటనకు వచ్చిన షర్మిలను కలిసి ఆమెతో ప్రత్యేకంగా పలు విషయాలను చర్చించారు. టిక్కెట్టు ఖరారు చేస్తే పార్టీలోకి వస్తానని ప్రతిపాదనలు పెట్టారు. గత నెల 28న కాంగ్రెస్ పార్టీ టిక్కెట్టు కోసం దరఖాస్తు చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ పార్టీ కూడా మధుసూదన్‌రెడ్డి అభ్యర్థి అయితే ఎలా ఉంటుందని సర్వే చేయించుకున్నట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీలో మధుసూదన్‌రెడ్డి చేరితే టీడీపీ, వైసీపీలకు గట్టి పోటీ ఇస్తారని చెప్పవచ్చు. ఆయన కాంగ్రెస్‌లోకి చేరితే వైసీపీ పైనే తీవ్ర ప్రభావం ఉంటుందన్న చర్చ జరుగుతోంది. ఇప్పటికే వైసీపీలో అసంతృప్తిగా ఉన్న నేతలు ఆ పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నారన్న చర్చ జరుగుతోంది.

గల్లంతైన ఇద్దరు విద్యార్థులు మృతి

చెన్నై విహారయాత్రలో విషాదం



మృతులు పెద్దిరాజు, శేషారెడ్డి (ఫైల్)



శోకసంద్రంలో పెద్దిరాజు తల్లి, బంధువులు

యాడికి, మార్చి 3: చెన్నై బీచ్‌లో గల్లంతైన అనంత విద్యార్థులు శేషారెడ్డి, పెద్దిరాజు ఇద్దరూ మృతిచెందారు. వారి మృతదేహాలను సముద్రం నుంచి రెస్క్యూ టీం ఆదివారం వెలికి తీసింది. దీంతో వారి స్వగ్రామాల్లో విషాదం నెలకొంది. మండలంలోని పెన్నా కాలేజ్ ఆఫ్ సిమెంట్స్ సైన్సెస్ విద్యార్థు లు శుక్రవారం విహార యాత్రకు వెళ్లారు. వీరిలో ఇద్దరు శనివారం ఉదయం చెన్నై బీచ్‌లో సముద్రంలోకి వెళ్లి.. అలల తాకిడికి కొట్టుకుపోయారు. రెస్క్యూటీం వారి కోసం గాలించి నా ఫలితం లేకపోయింది. విషయం తెలియగానే విద్యార్థుల కుటుంబ సభ్యులు చెన్నైకి వెళ్లారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగిస్తా మని అక్కడి అధికారులు తెలిపారు. యాడికి మండలం కుందనకోట గ్రామానికి చెందిన పెద్దిరాజు, పెద్దవడుగూరు మండలం అప్పేచర్ల గ్రామానికి చెందిన శేషారెడ్డి పెన్నా కాలేజీలో డిప్లొమా చివరి సంవత్స రం చదువుతున్నారు. చేతికి వచ్చిన బిడ్డలు మృత్యువాత పడటంతో ఆ కుటుంబాలు కన్నీరుమున్నీరవుతున్నాయి.

బియ్యం, చక్కెరతోనే సరి !

- మిగతా రేషన్ సరుకులకు కోత
- కందిపప్పు ఎప్పుడు ఇస్తారో తెలియని వైనం
- చతికిలపడిన సరుకుల పంపిణీ
- ఇబ్బంది పడుతున్న పేద వర్గాలు



ధర్మవరం, మార్చి 3: వైసీపీ పాలనలో చౌకధరల దుకాణాల ద్వారా పేదలకు బియ్యం, చక్కెర మాత్రమే అందిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం బియ్యం ఇస్తుండగా, మార్కెట్ ధరతో సమానంగా అర కేజీ చక్కెర కార్డుదారులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. ఈ రెండు సరుకులు కోసం ఎండీయూ వాహనం, దానికో సైరన్, డ్రైవర్, మరో సహాయకుడు. వీధుల్లో ఆ వాహనం వద్ద కార్డుదారుల క్యూ..ఇదీ ప్రస్తుతం రేషన్ పంపిణీ తీరు. దీనిపై ప్రతి పక్షాలు, కార్డుదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. తాను అధికారంలోకి వస్తే సన్నబియ్యంతో పాటు నిత్యావసర సరుకులను పేదలకు డోర్ డెలివరీ చేస్తానని వైసీపీ అధినేత జగన్ ఎన్నికల ప్రచారంలో ప్రకటించారు. అయితే అధికారంలోకి వచ్చి దాదాపు ఐదేళ్లు అవుతున్నా ఇప్పటికీ బియ్యం, చక్కెర మాత్రమే పేదలకు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. కందిపప్పు ఒక నెల ఇస్తే మళ్లీ ఎప్పుడు ఇస్తారో లేదో తెలియని పరిస్థితి. అది కూడా అందరికీ కాకుండా కొందరికి మాత్రమే అందుతుంది. ఎవరైనా కార్డుదారులు కందిపప్పు కావాలని అడిగినా లేదనే సమాధానం ప్రతీనెల ఎండీయూ వాహనదారుల నుంచి వస్తుంది. గోధుమ పిండి ప్యాకెట్లు అరకొరగా ఇస్తున్నా అవి కొద్ది రోజులకే పురుగు పడుతున్నాయి. దీంతో వినియోగదారులు వాటిని తీసుకోవడం లేదు. పామాయిల్ అసలే ఇవ్వడంలేదు. బియ్యానికి బదులుగా రాగులు/సజ్జలు/జొన్నలు ఇచ్చేవారు. వాటికి కూడా వైసీపీ ప్రభు త్వం శుభం కార్డు వేసింది. ఇలా పేదలకు రేషన్ సరుకుల్లో కోతపెట్టి సబ్సిడీ రూపంలో భరించాల్సిన నిధులను దారి మళ్లిస్తుండటంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పేదలపై ఆర్థిక భారం

ప్రభుత్వ తీరుతో ప్రజలపై ఆర్థిక భారం పడుతోంది. కిలో కందిపప్పు రకాలను బట్టి బహిరంగ మార్కెట్‌లో రూ.170 పలుకుతోంది. రేషన్ డిపోల ద్వారా సరఫరా చేస్తే పేదలపై ఆర్థిక భారం తగ్గేది. టీడీపీ పాలనలో ప్రతినెల కిలో కందిపప్పు రూ.40లకే సరఫరా చేసేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ ధరను రూ.67కి పెంచింది అయినా అందరికీ కందిపప్పును సక్రమంగా ఇవ్వడంలేదు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కిలో పంచదార రూ.14కు ఇచ్చేవారు. జగన్ దానిని అరకిలోకు పరిమితం చేశారు. పైగా ధరను మార్కెట్ ధరతో సమం చేశారు. అప్పుడు రాగులు, జొన్నలు వంటివి కూడా రాయితీపై కార్డుదారులకు ఇచ్చేవారు. ఇప్పుడు ఆ ఊసే లేదు. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

కన్ఫర్మేషన్ కొట్టేదెలా?



స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు

- ఆసరా సొమ్ము అందకపోయినా కన్ఫర్మేషన్ కొట్టాలట !
- ఎన్నికల వేళ అధికార పార్టీ ఒత్తిళ్లు
- ఇప్పటిదాకా 30శాతం మందికే సొమ్ము జమ
- బయటకు చెబితే ఉద్యోగాలు ఊడతాయని బెదిరింపులు

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 3: ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రభు త్వం డ్వాక్రా సంఘాల మహిళలకు అందిస్తున్న ఆసరా సొమ్ము పడకనే ..పడినట్లు కన్ఫర్మేషన్ కొట్టాలంటూ ఒత్తిడి చేయడం వివాదంగా మారుతోంది. ఇప్పటికే అక్కా చెల్లెమ్మలు, డీఆర్‌డీఏ-వైకేపీ సిబ్బందిని అధికారులు సొమ్ము బ్యాంకు ఖాతాల్లో జమ అయినట్లు అంగీకరించాలని ఆదేశించడం గమనార్హం. జనవరి 23న ఉరవకొండలో సీఎం జగన్ 30వేల సంఘాలలోని 3లక్షల మంది సభ్యులకు రూ.236 కోట్ల నిధుల చెల్లింపునకు బటన్ నొక్కారు. 45రోజులు గడుస్తున్నా 30శాతం మందికి మాత్రమే బ్యాంకు అకౌంట్లలోకి నగదు జమ చేశారు. మిగిలిన సభ్యులకు ఎప్పుడు పడుతుందో చెప్పలేని పరిస్థితి. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఆసరా సొమ్ము ఆలస్యం చేయడంతో అనేక అనుమానాలు వ్యక్త మవుతున్నాయి. లబ్ధిదారుల బ్యాంకు అకౌంట్లలో సొమ్ము పడకపోయినా పడినట్లు కన్ఫర్మేషన్ కొట్టాలని ఒత్తిడి చేయడం పట్ల సిబ్బంది అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అమౌంట్ పడకనే అకౌంట్లలోకి పడిందని ఎలా చెప్పే దంటూ సిబ్బంది, మహిళలు ప్రశ్నిస్తుండడం అధికారపార్టీ నేతలకు మింగుడుపడటం లేదు. దీంతో ఎవరైనా విషయాన్ని బయటకు చెబితే ఉద్యోగాలు ఊడతాయని హెచ్చరిస్తుండటం ఆందోళన కలిగించే అంశం. ప్రభుత్వ విధుల్లో రాజకీయ నేతల జోక్యంపై సిబ్బంది, మహిళలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఆందోళన చెందాల్సిన పనిలేదు



ఆసరా సొమ్ముకు సంబంధించి అర్హులైన స్వయం సహాయక సంఘాల మహిళలు ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు. వైఎస్సార్ ఆసరా పథకం సొ మ్ము చెల్లింపులు చేస్తాం. సాంకేతిక స మస్యలతో సొమ్ము బ్యాంకు ఖాతాలో జమకావడానికి ఆలస్యమవుతోంది. నియో జకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించి చెల్లింపులు చేస్తు న్నాం. విడతల వారిగా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేస్తాం. ఇందులో ఎటువంటి సందేహం లేదు. లబ్ధిదారుల బ్యాంకు అకౌంట్లలో సొమ్ము జమచేసిన తరువాతే కన్ఫర్మేషన్ కొట్టాలి.

- నరసింహారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ

వైసీపీ ఓట్ల దొంగాట: సీపీఐ



మాట్లాడుతున్న రామకృష్ణ

అనంతపురం విద్య, మార్చి 3: రాష్ట్రంలో వలంటీర్లు, దొంగ ఓట్లు, డబ్బులతో ఎన్నికలను ప్రభావితం చేయాలని వైసీపీ చూస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ధ్వజమెత్తారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఆయన పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్, అనంతపురం జిల్లా కార్యదర్శి జాఫర్, ఇతర నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే... అధికార పార్టీ రాష్ట్రంలో కుక్కర్లు, దుస్తులు, డబ్బులు పంచుతూ... తాయిళాలతో ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తోందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ దేశరాజకీయ వ్యవస్థకున్న విలువలను దిగజారుస్తున్నాడన్నారు. ప్రతిపక్ష పార్టీలపై బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తున్నాడని మండిపడ్డారు. జగదీష్ మాట్లాడుతూ ఓటరు జాబితాలోని తప్పులను ఎత్తిచూపినా... ఏమాత్రం సవరణ చేయడం లేదన్నారు. డబుల్ ఎంట్రీలు, వలసలు, మరణించిన వారిని తొలగించాలని అర్జీలు ఇచ్చినా తొలగించలేదన్నారు. ఒక్కో ఇంట్లో 50 ఓట్లు ఉన్నా తొలగించకుండా చోద్యం చూస్తున్నారంటూ మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు నారాయణ స్వామి, మల్లికార్జున, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, ఇతర నాయకులు లింగమయ్య, శ్రీరాములు, పద్మావతి, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

● సోమవారం ఉమ్మడి అనంతపురం జిల్లా సీపీఐ జనరల్ బాడీ సమావేశం నిర్వహించనున్నారు. నగరంలోని వీకే మెమోరియల్ హాల్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నారు. రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణతోపాటు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి నాయకులు హాజరుకానున్నారు.

నన్నెవరూ కిడ్నాప్ చేయలేదు: బంగి మల్లేష్



మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ బంగి మల్లేష్

ధర్మవరంరూరల్, మార్చి 3: తనను కిడ్నాప్ చేసినట్లు వస్తున్న వార్తలు నిరాధారమని కనగానపల్లి మండలం తూముచెర్ల సర్పంచ్ బంగిరేణుక భర్త మాజీ సర్పంచ్ బంగి మల్లేష్ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి అనంతపురంలోని మాజీమంత్రి పరిటాలసునీత నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను ఓ ప్రభుత్వ భూమికి సంబంధించిన విషయంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సోదరుడు చందుని కలిసిన మాట వాస్తవమని చెప్పారు. ఆయన సూచన మేరకు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డిని కలిశానని, ఆ సమయంలో ఎమ్మెల్యే తనకు వైసీపీ కండువా వేశారన్నారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్థులు, మా శ్రేయోభిలాషులు, నా సతీమణి రేణుక తీవ్ర ఆవేదనకు లోనయ్యారని వెల్లడించారు. అందుకే నేను చేసిన తప్పు తెలుసుకుని మళ్లీ పరిటాలసునీత, శ్రీరామ్‌వద్దకు వచ్చి జరిగిందంతా వివరించానని తెలిపారు. సాయంత్రం పరిటాల సునీత ఇంటివద్దనే ఉన్నానన్నారు. ఈలోపే తాను కిడ్నాప్ అయినట్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, ఇందులో ఎంతమాత్రం వాస్తవం లేదన్నారు. నేను పరిటాలసునీత ఇంట్లోనే ఉన్నానని నేను చేసిన తప్పుకు వారికి క్షమాపణ చెబుతున్నట్లు మల్లేష్ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ యాతంపోతలయ్య, నాయకులు ఆదెప్ప, మల్లికార్జున, జగదీష్, బిల్లేదాము, రాజాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని గెలిపిద్దాం.. అభివృద్ధికి బాటలు వేద్దాం

● నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు



ఉపాధ్యాయుల సమస్యలను తెలుసుకుంటున్న అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, మార్చి 3: టీడీపీ గెలుపుతోనే అభివృద్ధి సాధ్యమని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు అన్నారు. శనివారం రాత్రి, ఆదివారం పలు గ్రామాల ప్రజలు, నాయకులు, కార్యకర్తలు ప్రజావేదిక వద్దకు తరలివచ్చారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని అమిలినేని సురేంద్రబాబుకు పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు విన్నవించారు. స్పందించిన ఆయన పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పార్టీకి మద్దతు ఇచ్చి విజయానికి కృషి చేయాలని కోరారు. దాంతో పాటు శనివారం రాత్రి పొద్దుపోయే వరకు తనయుడు యశ్వంత్ చౌదరి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పర్యటిస్తూ యువతకు భరోసా ఇచ్చారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా టీడీపీ జోరు కనిపిస్తోందని, ఈ సారి టీడీపీ విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీలోని పథకాలను ప్రజలకు వివరిస్తూ, బాబుతోనే కుటుంబ భద్రత ఉంటుందని ఇంటింటికి వెళ్లి వివరించారు.

చౌడేశ్వరీదేవిని దర్శించుకున్న జేసీపీఆర్



అమ్మవారికి పూజలు చేయిస్తున్న జేసీపీఆర్

యాడికి, మార్చి 3: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారిని ఆదివారం తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ నిర్మాణం అద్భుతమని, నిర్వహణ సక్రమంగా చూసుకోవాలని ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఆయన వెంట టీడీపీ నాయకుడు చవ్వా గోపాల్‌రెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు తిరంపురం నీలకంఠ, పట్టణ అధ్యక్షుడు ఆదినారాయణ, రూపునేని రాజశేఖర్‌నాయుడు, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, తెలుగుయువత నాయకులు విక్రమ్, నారాయణస్వామి, చంద్రశేఖర్‌రెడ్డి, సుభాన్ ఉన్నారు.

వైభవంగా అశ్వత్థనారాయణస్వామి తిరునాళ్ల



విశేష అలంకరణలో అశ్వత్థ నారాయణస్వామి

పెద్దపప్పూరు, మార్చి 3: మండలంలోని చిన్న పప్పూరు గ్రామసమీపంలో వెలసిన అశ్వత్థనారాయణస్వామి, చక్రస్థాపిత భీమలింగేశ్వరస్వామి ఆలయ తిరునాళ ఆదివారం వైభవంగా జరిగింది. మాఘమాసం నాలుగవ ఆదివారం సందర్భంగా స్వామివార్లకు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. ఎస్ఐ శరత్‌చంద్ర సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు.

శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు



అలంకరణలో శ్రీకృష్ణుడు

గుత్తిరూరల్, మార్చి3: మండలంలోని కొత్తపేట గ్రామశివారులో వెలసిన శ్రీకృష్ణునికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా వేకువజామున స్వామి వారికి పంచామృతాభిషేకం, వివిధ పుష్పలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. యాదవ్ సంఘం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

95 శాతం పల్స్‌పోలియో

రాయదుర్గంరూరల్, మార్చి 3: ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పల్స్‌పోలియో కార్యక్రమం మండలంలో 95 శాతం పూర్తి అయినట్లు ఆవులదట్ల పీహెచ్‌సీ వైద్యులు మాధవమోహన్‌కుమార్ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. 14 సచివాలయ పరిధిలో 5300 మంది చిన్నారులకుగాను 95 శాతం మంది పిల్లలకు పోలియోచుక్కలు అందించినట్లు తెలిపారు. సూపర్‌వైజర్ పాతక్క, ఏఎన్ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రిటౌన్: పట్టణ, మండలవ్యాప్తంగా ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమం జరిగింది. పట్టణవ్యాప్తంగా 37బూత్‌ల ద్వారా పోలియో చుక్కల కార్యక్రమం జరిగినట్లు డాక్టర్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మొత్తం 98.65శాతం నమోదైందని తెలిపారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం

బొమ్మనహాళ్, మార్చి 3: మండలంలోని గోవిందవాడ గ్రామానికి చెందిన తిక్కపోట్లు రేవనణ్ణ(65) అనే వ్యక్తి అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. ఆదివారం మృతుడి అంత్యక్రియల కోసం స్థానిక టీడీపీ నాయకులు సోమనాథ్‌గౌడ్, ఎస్‌జీ వన్నూరుస్వామి రూ.ఐదు వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వేమన్న, సొంటి హనుమంతు, మహమ్మద్‌వలి, సొంటి వన్నూరుస్వామి, చెవులు వన్నూరు స్వామి పాల్గొన్నారు.

పచ్చదనం.. పరిశుభ్రత



చెత్తను ఎత్తివేస్తున్న సిబ్బంది

తాడిపత్రిటౌన్, మార్చి3: పట్టణంలో ఆదివారం పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమానికి టీడీపీ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా జేసీపీఆర్ ప్రత్యేకంగా ట్రాక్టర్లను ఏర్పాటుచేశారు. కొద్దిరోజులుగా పట్టణంలో పలు చోట్ల పేరుకుపోయిన చెత్తను సిబ్బంది తొలగించారు. ఆయావార్డుల్లో టీడీపీ కౌన్సిలర్లు దగ్గరుండి చెత్తను తొలగించే పనులను పరిశీలించారు.

7న నూతన రథం నిర్మాణ పనులు ప్రారంభం

ఉరవకొండ, మార్చి 3: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహ స్వామి ఆలయ నూతన రథం నిర్మాణ పనులు 7వ తేదీన ప్రారంభిస్తున్నట్లు ఈవో విజయ్‌కుమార్ తెలిపారు. స్థానిక ఆలయ ఆవరణలో నూతన రథనిర్మాణానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. రూ.2.30కోట్లతో రథం నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. దేవాలయ నిధుల కింద రూ.1.15లక్షలు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. మిగిలినవి భక్తుల నుంచి సేకరిస్తున్నామన్నారు. అందులో ఇప్పటికే రూ.96లక్షలు విరాళాలు ఇచ్చారన్నారు.

కరాటేలో విద్యార్థుల సత్తా



ప్రశంసాపత్రాలు, మెడల్స్‌ను చూపుతున్న విద్యార్థులు

తాడిపత్రిటౌన్, మార్చి 3: గుంతకల్లులో జరిగిన ఇంటర్ డిస్ట్రిక్ట్ కరాటే చాంపియన్ షిప్‌లో తాడిపత్రికి చెందిన మార్షల్ ఆర్ట్స్ జపాన్ షూటోరియో కరాటే స్కూల్ విద్యార్థులు సత్తా చూపారని మాస్టర్ శ్రీనివాసరెడ్డి ఆదివారం తెలిపారు. 14వ విభాగంలో నరసింహ, సోమతేజ రిషిక్‌రెడ్డి, నీరజ్‌రెడ్డి, పార్థసారధి రెడ్డి, తరుణ్, బాలాజీలు గోల్డ్‌మెడల్ సాధించారన్నారు. సిల్వర్‌మెడల్ సాధించిన వారిలో నరసింహ, గురుచరణ్, తేజితరెడ్డి, ప్రణీత్‌రెడ్డి, అఖిల్, లోకేశ్ ఉన్నారు. ప్రశంసాపత్రాలు కూడా పొందారని ఆయన తెలిపారు.

మీ ఓటుతో రాయదుర్గం తలరాత మారాలి: కాలవ



పద్మశాలీల కులబాంధవులతో మాజీ మంత్రి కాలవ

రాయదుర్గం, మార్చి 3: మీరు వేసే ఓటు రాయదుర్గం తలరాతను మార్చేలా ఉండాలని రాయదుర్గం నియోజకవర్గ అభ్యర్థి, మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని సీతారామాంజనేయ కళ్యాణమంటపంలో పద్మశాలీయుల ఆత్మీయ సమేశనాన్ని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పొరాళ్ల పురుషోత్తం అధ్యక్షతన జరిగింది. తొలుత మార్కండేయస్వామి చిత్రపటానికి పూలమాల వేసి సభను ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కాలవ మాట్లాడుతూ 2014లో రాయదుర్గం నుంచి ఎటువైపు వెళ్లినా రహదారులు బాగలేవన్నారు. గ్రామానికి ఎక్కువ పట్టణానికి తక్కువగా ఉండే రాయదుర్గంను జాతీయ రహదారికి అనుసంధానం చేయించానన్నారు. మూడు ఫ్లైఓవర్ల ఏర్పాటు పట్టణంలో రోడ్డు విస్తరణ చేసి రూపాన్నే మార్చామన్నారు. చేనేతవర్గాలు ఎప్పటికీ తెలుగుదేశం వెంట నడుస్తున్నారని కొనియాడారు. ఎవరి నాయకత్వంలో శాంతిభద్రతలకు సమస్య లేకుండా ప్రశాంతమైన రాయదుర్గం ఉంటుందో గత అనుభవాన్ని గుర్తు చేసుకుని నిర్ణయం తీసుకోవాలన్నారు. 50 వేల మెజార్టీతో గెలువబోతున్నామన్నారు. ఆ గెలుపులో చేనేతలు అందులో పద్మశాలీల పాత్ర కీలకంగా ఉండాలని కోరారు.

కలిసి పని చేద్దాం చంద్రబాబుని గెలిపిద్దాం

బొమ్మనహాళ్: కలిసికట్టుగా పనిచేసి తెలుగుదేశం పార్టీని గెలిపించుకొని చంద్రబాబును ముఖ్యమంత్రిగా చూడడమే లక్ష్యంగా పనిచేయాలని కాలవ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని ఎల్‌బీనగర్ గ్రామానికి చెందిన ముల్లంగి నారాయణస్వామి, ముల్లంగి భాస్కర్‌నాయుడు వైసీపీ నుంచి టీడీపీలోకి వస్తున్న నేపథ్యంలో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ ముల్లంగి నారాయణ స్వామి తిరిగి సొంత గూటికి వస్తుండడం ఆనందంగా ఉందన్నారు. వీరితో పాటు బొమ్మనహాళ్, హరేసముద్రం, ఉంతకల్లు గ్రామాలకు చెందిన కొందరు వైసీపీ నాయకులు టీడీపీలోకి అధికారికంగా ఒకటి రెండురోజుల్లో చేరబోతున్నారని అన్నారు. తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండాపురం కేశవరెడ్డి, మండల కన్వీనర్లు బలరాంరెడ్డి, హనుమంతరెడ్డి, మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ చంద్రహాస్, ఎర్రగుంట్ల వెంకటేశులు, తిమ్మరాజు, ఉప్పరహాళ్ స్వామి, కురువళ్లి తిప్పేస్వామి, పయ్యావుల మోహన్‌బాబు, సుదర్శన్‌రెడ్డి, పయ్యావుల అనిల్, శివశంకర్‌రెడ్డి, కావలి రాము, ప్రభు, గోవిందు, దివాకర్, మాజీ సర్పంచ్‌లు గోవిందరెడ్డి, కేశప్ప, ఉపసర్పంచ్ హనుమంతప్ప, మాజీ డైరెక్టర్ నాగరాజు, సంగప్ప, శివ పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

రాయదుర్గంరూరల్: తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా కృషి చేయాలని రాయదుర్గం నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు సూచించారు. ఆదివారం మండలంలోని పల్లేపల్లి గ్రామంలోని మాజీ డీసీసీ పాటిల్ వేణుగోపాల్‌రెడ్డి తనయుడు పాటిల్ అజయ్‌కుమార్‌రెడ్డి ఆహ్వానం మేరకు గ్రామంలో సమావేశం నిర్వహించారు. మాజీ మంత్రి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీని గెలిపించేందుకు కార్యకర్తలు, నాయకులు సమాయత్తం కావాలన్నారు. రాష్ట్రంలో అరాచకపాలన కొనసాగుతుందని ఆ పాలనకు చరమగీతం పాడేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో పాటిల్ సదాశివారెడ్డి, పాటిల్ అజయ్‌కుమార్‌రెడ్డి, మండల కన్వీనర్లు హనుమంతరెడ్డి, హనుమంతు, మోహన్‌రెడ్డి, సోమశేఖర్, ఈరన్న పాల్గొన్నారు.

టీడీపీలోకి చేరికలతో వైసీపీ గుండెల్లో గుబులు

కణేకల్లు: నియోజకవర్గంలో ప్రతిరోజూ ఎస్సీ, బీసీ, మైనార్టీతో పాటు ఇతర వర్గాలు టీడీపీలో చేరుతుండడంతో వైసీపీ నాయకుల గుండెల్లో గుబులు రేపుతోందని కాలవ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఎస్‌కే మల్లికార్జున ఆధ్వర్యంలో కణేకల్లు పట్టణానికి చెందిన 25 కుటుంబాలు కాలవ ఆధ్వర్యంలో టీడీపీలో చేరాయి. గస్తీ వెంకటేశులు, నాగరాజు, చిక్కణ్ణ, జాలేటి, బాలకృష్ణ, వన్నారెడ్డి, రఫీక్‌తో పాటు పలువురుకు టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో లాలెప్ప, ఆనంద్, వేలూరు మరియప్ప, బీటీ రమేష్, అనిల్, చంద్రశేఖర్‌గుప్తా, మాబుసాబ్, చాంద్‌బాషా, వెంకటేశులు, జయరాంచౌదరి, మారుతి, హరి, ఈరప్ప, వన్నూరుస్వామి, చిరంజీవి, ఆదినారాయణ, నాగార్జున పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్ర భవిష్యత్తు



పామిడిలో మాట్లాడుతున్న తెలుగు రైతు జిల్లా అధ్యక్షులు లక్ష్మీనారాయణరెడ్డి

పామిడి, మార్చి 3: తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్ర భవిష్యత్తు అని తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు ఎంహెచ్ లక్ష్మీనారాయణరెడ్డి అన్నారు. పట్టణంలోని ఎద్దులపల్లిరోడ్డులో ఉన్న తన నివాసంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని క్లస్టర్, యూనిట్, బూత్ లెవల్ ఇన్‌చార్జిలు ప్రతి ఇంటికి వెళ్లి బాబు సూపర్ సిక్స్ క్యాలెండర్లు అందజేయాలన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ గౌస్‌పీరా, మాజీ కౌన్సిలర్ చెన్నవరం మహబూబ్‌బాషా, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి శివశంకర్, టీడీపీ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, వడ్డే శివకుమార్, బొమ్మా మోహన్ కృష్ణ, జనసేన మండల అధ్యక్షుడు ధనుంజయ, టీడీపీ నాయకులు గాదిలింగ, పత్రా శ్రీనివాసులు, రంగస్వామియాదవ్, దశరథ, సాయి, జిలాన్, రాజు, శివ పాల్గొన్నారు.

కళ్యాణదుర్గంరూరల్: టీడీపీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని జనసేన నాయకులు లక్ష్మీపతి అన్నారు. ఆదివారం ఆయన అపిలేపల్లి, కుందుర్పి, తిప్పనపల్లి తదితర గ్రామాలలో పర్యటించి టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి అమిలినేని సురేంద్ర బాబును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆయా గ్రామాల్లో జనసేన నాయకులను, బలిజ కులస్థులను కలిసి ఉమ్మడి అభ్యర్థిని గెలిపిస్తే నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. సంజీవరాయుడు, జీ మురళీకృష్ణ, పేరూరు శ్రీనివాసులు, దివాకర్, ఈరణ్ణ, నరసయ్య, రమణకట్ట రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జనసేన నాయకుడు లక్ష్మీపతి

ఈతకెళ్లి విద్యార్థి మృతి



సాయిచరణ్(ఫైల్)

ఉరవకొండ, మార్చి 3: మండలంలోని పెన్నహోబిలం ఏటి గంగమ్మ సమీపంలో ఆదివారం సాయిచరణ్(17) అనే విద్యార్థి ఈతకువెళ్లి మృతి చెందాడు. ఉరవకొండ పట్టణం ఇందిరానగర్‌లో ఉంటున్న రాజేశ్వరి, రమేష్ దంపతుల కుమారుడైన సాయిచరణ్ గుంతకల్లులోని నారాయణ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మాఘమాసం నాల్గవ వారం కావడంతో కుటుంబసభ్యులతో కలిసి ఏటిగంగమ్మకు వెళ్లారు. స్నానం చేసేందుకు నిల్వ ఉన్న కుంట వద్దకు వెళ్లారు. ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడిపోయాడు. స్థానికులు గుర్తించి మునిగిపోతున్న విద్యార్థిని బయటకు లాగారు. హుటాహుటిన చికిత్స కోసం ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

రాయదుర్గంరూరల్, మార్చి 3: మండలంలోని మల్లాపురం సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్ణాటకలోని అశోక సిద్ధాపురం గ్రామానికి చెందిన నలుగురు భవననిర్మాణ కార్మికులకు తీవ్రంగా గాయపడ్డారు. కర్ణాటకలోని అశోక సిద్ధాపురం గ్రామానికి చెందిన గంగన్న, నాగరాజు, వసంత్‌రాజు అనే నలుగురు భవన నిర్మాణ కార్మికులు రాయదుర్గంలో పని ముగించుకుని స్వగ్రామానికి అశోక్ ద్విచక్రవాహనంలో వెళుతుండగా మల్లాపురం సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టడంతో నలుగురు గాయపడ్డారు. స్థానికులు గమనించి రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం గంగన్న, నాగరాజు, వసంతలను మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి రెఫర్ చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెండు లారీల ఢీ: డ్రైవర్‌కు..

గుత్తిరూరల్, మార్చి 3: మండలంలోని వన్నేదొడ్డి గ్రామశివారు 44వ జాతీయ రహదారిపై ఆదివారం రెండు లారీలు ఢీకొన్న ఘటనలో డ్రైవర్ గాయపడ్డాడు. హర్యానకు చెందిన డ్రైవర్ రుక్మణ్ లారీ అనంతపురం వైపుకు వెళ్తుండగా ముందుర వెళ్తున్న లారీని వెనక నుంచి ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గుర్తించి అతనిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరికి..

పుట్లూరు, మార్చి 3: మండలంలోని చింతకుంట గ్రామ సమీపంలో ఆదివారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఒకరు గాయపడ్డారు. రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో మడ్డిపల్లికి చెందిన రామకృష్ణారెడ్డికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం స్థానికులు ఆసుపత్రికి తరలించారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కణేకల్లు, మార్చి 3: మండలంలోని సొల్లాపురం గ్రామంలో టీడీపీ నాయకుడు డాక్టర్ నీలకంఠారెడ్డి ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరానికి మంచి స్పందన లభించింది. తల్లి దండ్రులు ఈశ్వర్‌రెడ్డి, సీతమ్మల జ్ఞాపకార్థం మార్క్ హాస్పిటల్, సింధు నర్సింగ్ హోమ్ సౌజన్యంతో వైద్యశిబిరం ఏర్పాటు చేయగా, 350 మంది రోగులు హాజరయ్యారు. ఇందులో వందమంది వరకు ఈసీజీ, ఏకో తీసినట్లు వైద్యులు విక్రమ్, శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. రోగులకు ఉచిత మందులతో పాటు భోజన సౌకర్యాన్ని కూడా ఏర్పాటు చేశారు. మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు వైద్య శిబిరాన్ని సందర్శించి డాక్టర్ నీలకంఠారెడ్డిని అభినందించారు. ఎంపీటీసీ కేశవరెడ్డి, గ్రామస్థులు రవీంద్ర, శేషప్ప, వెంకటేష్‌చౌదరితో పాటు పలువురు పాల్గొన్నారు.

సేవాదృక్పథాన్ని అలవర్చుకోవాలి

పామిడి, మార్చి 3: సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని ఆయూష్ సీనియర్ వైద్యాధికారి నల్లపాటి తిరుపతినాయుడు అన్నారు. పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 132 మంది రోగులకు వైద్య సేవలందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 95మందిని శస్త్ర చికిత్సకు ఎంపికచేశారు. వీరందరికీ శంకర కంటి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేయించనున్నట్లు ఆయన తెలిపారు. లయన్స్ క్లబ్ డైరెక్టర్లు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.80 వేలు విరాళం

కణేకల్లు, మార్చి 3: మండలంలోని ఆదిగానపల్లి గ్రామ ఎస్సీకాలనీలో నిర్మిస్తున్న దుర్గమ్మ, ఎల్లమ్మ దేవతల ఆలయ నిర్మాణానికి టీడీపీ సర్పంచ్ రుద్రముని, తిప్పేస్వామి రూ.80 వేలు విరాళం అందించారు. ఆదివారం ఆలయ సభ్యులు దుర్గయ్య, రామాంజి, గంగాధర్‌లకు నగదును అందించారు.

చెస్‌లో విద్యార్థుల ప్రతిభ

గుంతకల్లుటౌన్, మార్చి 3: గుంతకల్లు టౌన్ లెవల్ అండర్-15చెస్ టోర్నమెంట్‌లో పెంగ్విన్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు కరస్పాండెంట్ నాగార్జున తెలిపారు. స్థానిక పెంగ్విన్ క్లబ్‌లో ఆదివారం గుంతకల్లు టౌన్ లెవల్ అండర్-15చెస్ టోర్నమెంట్ నిర్వహించారు. పోటీలో జాహ్నవిముత్యాల, వై ఉపేంద్ర, సాయిగౌతమ్, ఉదయ్‌కిరణ్, రాఘవ ప్రతిభ కనబరిచారు. వీరికి మెమెంటో, మెడల్స్‌ను అందజేశారు. చెస్ నిర్వాహకులు పాల్గొన్నారు.

బావిలో పడి వ్యక్తి మృతి



రామాంజనేయులు (ఫైల్)

పుట్లూరు, మార్చి 3: మండలంలోని గరుగు చింతలపల్లి గ్రామంలో ఆదివారం మిద్దెల రామాంజనేయులు (43) అనే వ్యక్తి మతిస్థిమితం లేక బావిలో పడి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలమేరకు ఎల్లమ్మ, నాగయ్యల కుమారుడు రామాంజనేయులుకు కొన్నేళ్లుగా మతిస్థిమితం సరిగా లేదు. గ్రామంలో తోటల వద్దకు వెళ్లి మళ్లీ తిరిగి ఇంటికి వచ్చేవాడు. మూడురోజులక్రితం ఎక్కడికో వెళ్లి ఇంటికి రాకపోయేసరికి చుట్టుపక్కల గాలించారు. గ్రామ శివారులో ఉన్న నీటి బావిలో శవమై కనిపించాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రికి తరలించారు. మృతుడికి వివాహం కాలేదు. తలిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు.

పరస్పరం దాడి.. ఇద్దరికి గాయాలు

తాడిపత్రిటౌన్, మార్చి3: పట్టణంలోని యల్లనూరురోడ్డులో ఆదివారం జరిగిన పరస్పరదాడిలో ఇరువురు గాయపడినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. జింకా ప్రవీణ్, సాయిచైతన్య ద్విచక్రవాహనంలో వెళుతుండగా ఇదే సమయంలో రెడ్డివారిపాలెం నుంచి మరొక ద్విచక్రవాహనంలో ఇరువురు వచ్చారు. వేగంగా ఎందుకు వచ్చావంటూ ఇరువురు ద్విచక్రవాహనదారులు వాగ్వాదానికి దిగారు. మాటమాట పెరగడంతో ఒకరిపై ఒకరు దాడిచేసుకున్నారు. దాడిలో జింకా ప్రవీణ్, సాయిచైతన్య గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేస్తామని ఎస్ఐ తెలిపారు.

రేపటి నుంచి యువచైతన్య యాత్ర

తాడిపత్రిటౌన్, మార్చి3: మండలంలో 5 నుంచి 13వ తేదీ వరకు టీడీపీ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో యువచైతన్య బస్సుయాత్ర చేపట్టనున్నారు. 5న యర్రగుంటపల్లి, రావివెంకటాంపల్లి, చిన్నపల్లి, తాతగారిపల్లి, కోమలి, పెద్దపొలమడ, చిన్నపొలమడ, 6న టి. తిమ్మాపురం, తేరన్నపల్లి, ఎగువపల్లి, దిగువపల్లి, కొనగుంటపల్లి, కొట్టాలపల్లి, తిప్పారెడ్డిపల్లి, ఆర్డీటీకాలనీ, 7న అక్కన్నపల్లి, హుస్సేనాపురం, వీరాపురం, బొందలదిన్నె, వంగనూరు, కొండేపల్లి, జంబులపాడు, చల్లవారిపల్లి, గన్నెవారిపల్లి, 9న చుక్కలూరు, పులిప్రొద్దుటూరు, గంగాదేవిపల్లి, జోగినాయునిపల్లి, బందార్లపల్లి, సీతారాంపురం, ఇగుడూరు, 10న బ్రహ్మణపల్లి, తిమ్మేపల్లి, వెంకటాంపల్లి, అయ్యవారిపల్లి, భోగసముద్రం, బుగ్గ, 11న గదరగుట్టపల్లి, తేళ్లమిట్టపల్లి, సి. వరదాయపల్లి, కావేరిసముద్రం, వెంకటరెడ్డిపల్లి, సజ్జలదిన్నె, 12న బోడాయిపల్లి, వెలమకూరు, ఆలూరు, ఊరుచింతల, తలారిచెరువు, ఆవులతిప్పాయపల్లి, 13న గన్నెవారిపల్లికాలనీలో బస్సుయాత్ర ఉంటుందని టీడీపీ వర్గాలు తెలిపాయి.

ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు

విడపనకల్లు, మార్చి 3: మండలంలోని ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో చేరాలనుకునే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ గంగాధర్ గౌడ్ ఒక ప్రకటనలో కోరారు. 31వ తేదీ వరకూ దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఏప్రిల్ 4వ తేదీన ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. 5వ తరగతి పూర్తి అయ్యిన విదార్థులు స్టడీ, ఆధార్ కార్డులతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులు పాఠశాలలో అందజేయాలన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

రాయదుర్గంరూరల్, మార్చి 3: పట్టణంలోని చంద్రబాబునాయుడు కాలనీలో అక్రమంగా కర్ణాటక మద్యాన్ని అమ్ముతున్న రమేష్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు అర్బన్ సీఐ శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చంద్రబాబునాయుడు కాలనీలో రమేష్ అనే వ్యక్తి కర్ణాటక మద్యాన్ని అమ్ముతున్నాడన్న సమాచారాన్ని సేకరించి దాడి చేసి అతని వద్ద నుంచి 30 ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ తెలిపారు.

కళ్యాణదుర్గంరూరల్: మండలంలోని హనిమిరెడ్డిపల్లి సమీపంలో కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న టెట్రా ప్యాకెట్లను పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. ముద్దినాయనపల్లికి చెందిన చాకలి శివ వైఎన్ హోసకోట నుంచి 384 టెట్రా ప్యాకెట్లను ద్విచక్ర వాహనంలో తరలిస్తుండగా సమాచారం అందుకున్న అనంతపురం సెబ్ ఇంటెలిజెన్స్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, కళ్యాణదుర్గం సెబ్ సీఐ ఎర్ర వెంకట్ దాడి చేసి నిందితున్ని పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

డీ.హీరేహాళ్: మండలంలోని కల్యం చెక్‌పోస్టు వద్ద ఆదివారం పోలీసులు కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఆర్‌బీవంక గొల్లలదొడ్డి గ్రామానికి చెందిన నాగన్న అనే వ్యక్తి తన ద్విచక్రవాహనంలో కర్ణాటక మద్యం తరలిస్తుండగా ఎస్ఐ తన సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా నాగన్న వద్ద మద్యం ఉన్నట్లు గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇంట్లో చోరీ

గుంతకల్లుటౌన్, మార్చి 3: పట్టణంలోని ప్రశాంత్ నగర్‌లో నివాసముంటున్న మహమ్మద్ నూర్ అలీ ఇంట్లో చోరీ జరిగింది. 50 తులాల బంగారు నగలు, రెండున్నర కేజీల వెండి, రూ.1.50లక్షల నగదును దుండగులు ఎత్తుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మహమ్మద్ నూర్ అలీ హైదరాబాదులో డెకరేషన్ షాపు నిర్వహిస్తున్నాడు. ఆమె తల్లి మూడు నెలల క్రితం దుబాయ్‌కి వెళ్లిందన్నారు. మహమ్మద్ నూర్ అలీ 15రోజులు క్రితం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో హైదరాబాదుకు వెళ్లాడన్నారు. శనివారం ఉదయం ఇంటి తలుపులు తెరచి ఉండటాన్ని గమనించిన ఎదురింటి వారు అలీకి ఫోన్ చేసి చెప్పారన్నారు. అతడు శనివారం రాత్రి ఇంటికి చేరుకున్నాడు. కింద, పైన ఇంట్లో బీరువాలను పగలగొట్టి 50తులాల బంగారు నగలు, రెండున్నర కేజీల వెండి, రూ.1.50లక్షలు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపాడు. ఈ విషయంపై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు అనంతపురం నుంచి క్లూస్ టీంను రప్పించి వేలిముద్రలను సేకరించారు. బంగారు నగలు, వెండి, నగదుపై విచారణ చేసి బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని సీఐ రామసుబ్బయ్య తెలిపారు.

పోలియో మహమ్మారిని తరిమికొడదాం

ప్రతి చిన్నారికి రెండు చుక్కలు వేయించి పోలియో మహమ్మారిని తరిమికొడదామని పలువురు వక్తలు అన్నారు. అన్ని పీహెచ్‌సీ సెంటర్లలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాల్లో ముఖ్య అతిథులు 0-5 సంవత్సరాల చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఆదివారం చుక్కలు వేయించుకోని వారికి సోమ, మంగళవారాల్లో ఇంటింటికి వెళ్లి వేస్తామని వైద్య సిబ్బంది తెలిపారు. - ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్



ఉరవకొండలో చిన్నారికి చుక్కలు వేస్తున్న సర్పంచ్



తాడిపత్రిలో...



కళ్యాణదుర్గం: చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న యశ్వంత్‌చౌదరి



పోలియో చుక్కలు వేస్తున్న ఆర్డీఓ రాణి సుశ్మిత



గుంతకల్లులో...



బొమ్మనహాళ్‌లో...



గుత్తిలో...



పామిడిలో...